
కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక

మే 2010




కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాస పత్రిక

సంచిక:2 మే :2010 సంపుటి: 3


(http://kottapalli.in లోని e - సంచికకు పుస్తక రూపం)

ఈ సంచికలో. . . .



ఈ మాసపు ముఖచిత్రం

"వేసవి శలవలు"



తుపాకులు

ఆరవ తరగతి పిల్లవాడొకడు ఆ మధ్య వాళ్ళ బడికి ఒక తుపాకీ తీసుకుపోయాడట.

ఆ తుపాకీ బొమ్మది కాదు. అందులో బుల్లెట్లు రబ్బరువీ కావు. అది నిజం తుపాకీ!

వాళ్ళ నాన్నదిట అది. వాళ్ళ ఇంట్లో మొత్తం రెండు తుపాకులుంటాయట- ఒకటి వాళ్ళ నాన్నది; ఒకటి వాళ్ళ అమ్మది. వాటితో వాళ్ళు ఏం చేస్తారో తెలీదు. మొత్తానికి ఒక తుపాకీ ఈ పసివాడి చేతిలోకి వచ్చింది.

వాడు అప్పటికే చాలా వీడియో గేములూ, కంప్యూటర్ గేములూ ఆడి ఉన్నాడు. తుపాకీతో ఏంచేస్తారో వాడికి బాగా తెలుసు. తుపాకీని గురిపెట్టటం వాడికి చక్కగా వచ్చు. ఎందరో టి.వి. రాక్షసుల్ని పేల్చేసిన అనుభవం ఉన్నది వాడికి. బడిలో తనకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటున్న కుర్రవాళ్ళు ఇద్దర్ని , పిట్టల్ని కాల్చినట్లు కాల్చి పడెయ్యటం వాడికి ఏమాత్రం కష్టం కాలేదు.

వెయ్యిమంది విద్యార్థుల ఎదుట, విద్య గరపే టీచర్ల సాక్షిగా, వాడు తన తోటి పిల్లల్ని కాల్చి చంపేశాడు.

తల్లిదండ్రులనుండి పిల్లలు చాలా సంగతులు నేర్చుకుంటారు. వాళ్ళని ఎంత దూరంగా, బోర్డింగు స్కూళ్లలో ఉంచినా సరే, పిల్లలు తల్లిదండ్రుల అలవాట్లని అంత తొందరగా మర్చిపోరు.

తల్లి, తండ్రి తుటాలు, బాంబులు లేకుండా బ్రతకలేని అస్తవ్యస్త జీవితపు జీవులైనప్పుడు, పిల్లలు శాంతసౌహార్ద్రమూర్తులవ్వటం కాస్తంత కష్టమే.

అందుకని, పిల్లలున్న పెద్దలు చాలా జాగ్రత్తగా ఉండాలి. తమ దురలవాట్లు పిల్లలకు సోకకుండా ఉండేందుకు శ్రమించాలి.

తండ్రి రోజూ గుప్పు గుప్పున సిగరెట్లు కాలుస్తూ, పిల్లలచేతే వాటిని తెప్పించుకుంటేనూ, త్రాగి రోడ్డుమీద ఎక్కడపడితే అక్కడ పడి దెబ్బలు తగిలించుకుంటుంటేనూ, గూండాగా అందరినీ బెదిరించుకొని బ్రతుకుతుంటేనూ, భార్యలను కొట్టి, గొడవపడుతుంటేనూ పిల్లల మానసిక స్థితి సరిగా ఉండదు. అలాంటి పిల్లలు తల్లిదండ్రుల మాదిరే తుపాకులకు, సెల్ ఫోన్లకు, మోటారు బైకులకూ బానిసలై, తమకు ఇంట్లో దొరకని ప్రేమల్ని వీధుల వెంబడి, సారాదుకాణాల్లోను, పబ్బుల్లోను, డిస్కోథెక్కుల్లోను వెతుక్కుందామనుకుంటారు.

పిల్లలు సహజ సౌకుమార్యంతో, సంతోషంగా ఎదిగి, బాధ్యతగల పౌరులవ్వాలంటే, ముందుగా పెద్దలు బాగుపడాలి. మనం వ్యసనాలకు దూరమైతే తప్ప, మన పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యాలు బాగుపడవని గ్రహించాలి- ఏమంటారు?

ఈమాసంలో పిల్లలందరూ వేసవి శలవల్లో ఉంటారు. ఇళ్లన్నీ హడావిడిగాను, గజిబిజిగానూ ఉంటై. పిల్లలు ఎండల్లో తిరిగి వడదెబ్బలు తినకుండా ఉండాలంటే, వాళ్ళు ఆడుకునేందుకు ఇష్టపడే ఆటలు వాళ్లకి అందాలి. ఆటల్లో గొప్పవి, తక్కువవి అంటూ ఏమీ లేవు- అన్నీ ఆటలే, అన్నీ పిల్లలకు ఏదో ఒక రకంగా పనికొచ్చేవే. రకరకాల ఆటల సమాహారంగా, ఈ నెల ముఖచిత్రం- "వేసవి" ని అందించిన చిత్రకారుడు అడవి రాముడుకి అభినందనలు.



వేసవి శలవల శుభాకాంక్షలతో,

-కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక

ఏడవ భాగం

మూల రచన: కీ.శే. పరవస్తు చిన్నయసూరి　　　*సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

జరిగిన కథ: కాకికి, మంథరుడికి తన కథను చెబుతుంది ఎలుక. ఆపైన, దురాశకొద్దీ ఎక్కువ సంపాదించాలని పోయి, వింటిదెబ్బ తిని చచ్చిన నక్క కథ చెప్పి, తాబేలు "అందుకనే, అతిగా కూడబెట్టాలన్న కోరిక మంచిది కాదు" అంటుంది. ఇక చదవండి, ఏడవ భాగం..

తాబేలు ఇంకా ఇలా అన్నది- “అయినా, గతించినదాన్ని ఇప్పుడు త్రవ్వుకోవడం ఎందుకు? పోనివ్వు. బుద్ధిమంతులు 'రాని దాని కోసం ఎదురుచూడరు, పోయిన దానికోసం ఏడ్వరు, ఆపదలు వచ్చినప్పుడు అచేతనంగా నిలబడిపోరు'. కాబట్టి, స్నేహితుడా! ఎల్లప్పుడూ సంతోషంగా, ఉత్సాహంగా ఉండు."

"శాస్త్రాలు చదివి కూడా అనేక మంది మూర్ఖులుగానే ఉన్నారు. క్రియావంతుడైన

వాడే విద్వాంసుడు. మందు పేరు చెప్పినంత మాత్రాన రోగికి రోగాలు శాంతించవు. గుడ్డివాడి చేతిలో ఉన్న దీపం వల్ల అతనికి ఏమీ లాభం లేనట్లే. వివేకం లేనివాడికి ఎంత శాస్త్ర పాండిత్యం ఉన్నా ప్రయోజనం ఉండదు. చూడు, ఆపదలు వచ్చినందుకు నేను దు:ఖించను. సంపద వచ్చినప్పుడు నేను పొంగిపోను. మనిషికి ఆపదలు, సంపదలు ఒకదాని వెనుక ఒకటి వస్తూండటం సహజం. 'సంపదలు శాశ్వతం కావు' అని తెలుసుకున్నవాడు, అవి పోయినప్పుడు దు:ఖించడు. డబ్బు లేనంతమాత్రాన ధైర్యవంతుడికి లోకంలో గౌరవం ఏమీ తక్కువ కాదు. పుష్కలంగా ఉన్నంత మాత్రాన క్షుద్రుడికి గౌరవమూ రాబోదు. సింహానికి సహజంగానే ఒక తేజస్సు ఉంటుంది- నూరు బంగారు సొమ్ములు పెట్టినా కుక్కకు అంతటి తేజస్సు అబ్బుతుందా? నువ్వు బుద్ధిమంతుడివి. నీ గౌరవానికి ఇప్పుడు ఏమి లోటు వచ్చింది? జీవిని పుట్టించిన ఆ భగవంతుడు, ఏదో ఒక విధంగా ఆహారాన్ని కూడా ఏర్పాటు చేస్తాడు. చూడు -జంతువు పుట్టి నేలమీద పడీ పడగానే తల్లి రొమ్ము నందిస్తున్నది. అందువల్ల, బ్రతకటం కోసం మరీ ఎక్కువ శ్రమించటం కూడా వ్యర్థమే. అన్ని ధర్మాలూ తెలిసిన వాడివి, నీకింత విడమరచి చెప్పవలసిన అవసరమే లేదు. నీకు నేను వేరు, లఘుపతనకం వేరు కాదు. దేవుడే మనల్ని ముగ్గుర్నీ ఒకచోట చేర్చినట్లు ఉన్న ది. దొరికినదానితో సంతృప్తి చెంది మనం సుఖంగా జీవిద్దాం. " అన్నదది ఎలుకతో.

అప్పుడు హిరణ్యకుడు చాలా సం తోషిం చి, "మంథరా! నీమాటలు అమృతపుజల్లు లాగా కురిసి, అంతులేని నా దు:ఖాన్ని పోగొట్టాయి. నేను ధన్యుడినయ్యాను. 'మిత్రలాభం ప్రపంచంలోని సంపదలన్నిటి పెట్టు '- అన్నసూక్తి కూడా నాకు ఇప్పుడు అర్థం అయ్యింది."

"ఏ భగవంతుడైతే హంసలను, రామచిలుకలను, నెమళ్ళను, తెలుపు, అకుపచ్చ మొదలైన రంగులను సృష్టించాడో, ఆభగవంతుడే ఆయా జంతువులకు వాటికి అనుగుణమైన వృత్తులను కల్పించాడు. మూర్ఖులు దీన్ని అర్థం చేసుకోలేక, జీవనం

కోసం పడరాని పాట్లు పడి, సమయాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు."

" తనను సంపాదించేటప్పుడొక దు:ఖం, కాపాడుకోవటంలో ఒక దు:ఖం, అది నాశనం అయిపోయేటప్పుడొక దు:ఖాన్ని కలిగిస్తున్నది డబ్బు. ఇట్లా దు:ఖానికి మూలకారణం అయిన ఆ డబ్బెందుకు? కాల్చడానికా? సొంత పనులకోసం డబ్బును కోరటం కంటే, కోరికను వదిలి ఊరకుండటమే మేలు. అడుసు తొక్కటం ఎందుకు, కాళ్లు కడగటం ఎందుకు? ఆకాశంలో పక్షుల చేత, భూమిపైన క్రూర మృగాల చేత, నీళ్లలో చేపల చేత మాంసం తినబడుతున్నది, కానీ ధనవంతుడు అన్నింటా తినబడతాడు. కాబట్టి ధనాశను వదిలి పెట్టడంలోనే వివేకం ఉన్నది. ఆశను వదిలిపెట్టేస్తే, ఇక ఆ పైన దరిద్రుడెవ్వడు, ధనికుడెవ్వడు?"

"ఇక దురాశకు అవకాశం ఎవరిస్తారో, దాస్యం వాడి తలపైకెక్కి కూర్చొని రాజ్యమేలుతుంది. నిన్ను కలిసి మాట్లాడటం వల్ల నా అజ్ఞానం తొలిగింది. చేపట్టిన పని పూర్తైనంత సంతోషం కలిగింది. నీతో నిరంతరం కలిసి ఉండటాన్ని మించిన అదృష్టం నాకు వేరే ఏదీ లేదు. నీతో స్నేహానికి ఎలాంటి లోటూ ఉండదు. మహాత్ముల స్నేహం ఆమరణాంతం ఉండేది. వారి కోపాలు ఒక్క క్షణంలో నశించే బుడగలాంటివి, ఇక మహాత్ముల త్యాగం అయితే సందేహానికి తావు లేనిది." అని చెప్పింది. మంధరుడు ఆ మాటలు విని, చాలా సంతోషించింది. ఆ పైన హిరణ్యకుడు, లఘుపతనకము, మంధరుడు స్వేచ్ఛగా విహరిస్తూ, కాలక్షేపం చేస్తూ సుఖంగా జీవించసాగారు.



కొంతకాలానికి, మంథరుడు, హిరణ్యకుడు, లఘుపతనకుడు ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో బెదిరిపోయిన జింక ఒకటి, మహా వేగంతో అక్కడికి పరుగెత్తుకొని వచ్చింది. అది చూసి భయపడిన తాబేలు నీళ్లలోకి దూకింది; ఎలుక కలుగులోకి పారిపోయింది; కాకి ఎగిరి, చెట్టు కొన కొమ్మన కూర్చున్నది.

కొంచెంసేపటికి కాకి చెట్టుమీది నుండి అన్నివైపులకూ నిక్కి నిక్కి చూసి, ఇక భయపడవలసిన కారణం ఏదీ దగ్గరలో లేదని నిశ్చయించుకున్నది. ఆపైన అది మంథరుడినీ, హిరణ్యకుడినీ పిలిచి, "మీరు భయపడకండి. చుట్టు ప్రక్కల చాలా దూరం వరకూ చూశాను. భయానికి కారణం ఏదీ నా కంట పడలేదు." అని చెప్పగానే నీటిలోంచి తాబేలు, బొరియలోంచి ఎలుక, బయటకి వచ్చాయి. లఘుపతనకం వెళ్లి వాళ్ళకు దగ్గరగా వాలింది.

అప్పుడు, భయంతో గడగడా వణుకుతున్న జింకను చూసి, మంథరుడు- "నువ్వెవ్వడివి? ఎందుకు, నువ్విట్లా పరుగెత్తుకొని వచ్చావు?" అని అడిగింది. డొక్కలు ఆడేట్లు రొప్పుతున్న ఆ జింక అన్నది- "నాపేరు చిత్రాంగుడు. వేటగాడొకడు నన్ను తరుముకొని వచ్చాడు. వాడికి భయపడి, పారిపోయి వచ్చాను. ఆ పరుగులో నన్ను అందుకోలేక, వాడు వెనుక బడ్డాడు. నేను మీ శరణు జొచ్చాను. అన్ని దానాలు,అన్ని వ్రతాలు, అన్ని యాగాలు- ఇవేవీ శరణాగతుడిని కాపాడటంతో సరిపోలవు. శరణుగోరిన వారిని పట్టించుకోలేక పోవడం కంటే పాపం లేదని ధర్మశాస్త్రం తెలిసిన పెద్దలు చెబుతూ ఉంటారు. మీరు అన్ని ధర్మ శాస్త్రములూ తెలిసిన వారని బుద్ధిమంతులు గతంలో చెప్పగా విని ఉన్నాను. నా మనసు కలత చెంది ఉండటం వల్ల ఏది చెప్పదగిందో, ఏది చెప్పకూడని మాటో తెలీక ఏదేదో అనేశాను. మీకు ధర్మం చెప్పేంత వారిని కాను. నా మాటల్లో తప్పుల్ని మన్నించి, నన్ను కాపాడండి. మీ స్నేహం సంపాదించుకొని, మీతో పాటు ఇక్కడే కాలం గడపాలని నా కోరిక. మా బంధువులను, మా దేశాన్నీ విడిచి వచ్చాను. మీ శరణుజొచ్చాను. ఇక మీరు నన్ను పాల

ముంచుతారో, నీట ముంచుతారో, మీదే భారం," అన్నది.

అప్పుడు మంథరుడు దాన్ని శాంతపరుస్తూ అన్నది- "చిత్రాంగా! నువ్వు బుద్ధిమంతుడివి. సాధువువు. నీతో స్నేహం చేయటం మా భాగ్యం. దీనికై ఇంత చెప్పవలసిన పనిలేదు. ఇది నీ యిల్లే అనుకో. మాతో కలసి స్వేచ్ఛగా జీవిస్తూ, సుఖంగా ఉండు" అని. అప్పుడు ఆ జింక చాలా సంతోషించి అక్కడే ఉండి-పోయింది. ఆ అడవిలోని లేత పచ్చిక చిగుళ్ళను మేస్తూ చెరువులోని నీటిని త్రాగుతూ, దగ్గరలోనే ఉన్న చెట్టు నీడన పడుకుంటూ, సుఖంగా కాలం గడపసాగింది.

ఇలా కొంతకాలం గడిచింది. ఒకరోజున జింక, మేతకని అడవిలోనికి వెళ్ళింది. సాయంత్రం మామూలుగా అది తిరిగివచ్చే సమయం దాటిపోయింది. అయినా అది ఇంకా ఇంటికి చేరుకోలేదు. దాంతో కంగారు పడిన మంథరుడు, కాకి-ఎలుకలతో "మన స్నేహితుడు చిత్రాంగుడు ఇంత ఆలస్యం చేయటానికి కారణం ఏమై ఉంటుంది? ఏనాడూ ఇంత సేపటి వరకూ రాకుండా లేదు. ఆహారం కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన పక్షుల గుంపులు తినటం చాలించి ఇళ్లకుతిరిగివస్తున్నాయి. గొల్లవాళ్లు పశువుల మందల్ని తోలుకొని పల్లెలకు పోతున్నారు. పడమట దిక్కు ముఖానికి కుంకుమ బొట్టు మాదిరి కనబడుతున్నాడు సూర్యుడు. ఆ సూర్యకిరణాల వేడి తగ్గిపోతున్న కొద్దీ నాకు ఆరాటం పెరిగిపోతున్నది. 'కొంచెం అటు-ఇటు వెళ్లి వెతికి వద్దామం'టే నా నడక వేగం సహకరించదు. 'మిమ్మల్ని పంపుదామా' అంటే మీరు మళ్లీ తిరిగి వచ్చి నా కళ్లకు కనిపించేత వరకు నా మనస్సు తత్తరపడుతూ ఉంటుంది. నేనేమి చేసేది?" అని, కళ్లల్లో నీరు కారగా దిక్కులు చూడసాగింది.

అప్పుడు కాకి లఘుపతనకం "పక్షిజాతులు అన్నిటికంటే నా వేగం ఎక్కువ. ఎన్ని యోజనాల దూరమైనా క్షణకాలంలో తిరిగి చూసి రాగలను. అందుకనేగదా నాకు 'లఘుపతనకుడు' అని పేరు వచ్చింది? నువ్వేమీ విచారించకు . నేను ఇక్కడే

ఉన్నాననుకో. ఇదిగో, ఒక్క నిముషంలో వెనక్కివచ్చి చిత్రాంగుడి క్షేమ సమచారాలు నీకు చెబుతాను- చూస్తూండు" అని తక్షణం ఎగిరిపోయింది.



అలా ఆ కాకి అడవిలోని నానా ప్రదేశాలనూ వెతికి, త్వరలోనే చిత్రాంగుడు ఉన్న ప్రదేశాన్ని కనుక్కున్నది. అక్కడ చిత్రాంగుడు త్రాళ్ల వలలో చిక్కుకొని పడి ఉన్నది. అప్పుడు లఘుపతనకుడు దాన్ని చూసి, కళ్ల నీరు పెట్టుకొని, దాని దగ్గరకు పోయి "మిత్రమా! నువ్వు ఇతరుల సొమ్ముకు ఆశపడవు. ఇతరులను బాధించవు. అడవిలోని గడ్డిని మేసి, గుంటలలోని నీళ్లు త్రాగి, ఏదైనా చెట్టు నీడన పడుకొని కాలం గడుపుతావు. ఇతరులెవ్వరికీ కీడు నీ ఆలోచనల్లో కూడా రాదు. నీ అంత మంచివాడికా, ఇట్లాంటి ఆపద ఎదురు అయింది? అయినా ఇంత అనుకోవటం ఎందుకు? ఎంతవారికైనా దైవనిర్ణయాన్ని దాట శక్యంకాదు. వచ్చిన కష్టాన్ని `ఎలా దాటాలి' అని ఆలోచించాలిగాని, నివ్వెరపోయి నిల్చుండకూడదు. కాబట్టి , నీకు తెల్సినంతలో- ఇప్పుడేం చేయాలో త్వరగాచెప్పు. మంధరుడు, హిరణ్యకుడు నా రాక కోసం ఎద్ర్యురుచూస్తూంటారు. పోవాలి" అన్నది.

"వేటగాడు రాక ముందే త్వరగా నన్ను విడిపించారంటే బ్రతికిపోతాను. లేకపోతే ఇక నా పైన ఆశ పెట్టుకోవద్దు. నువ్వు ఇప్పుడు పోయి, తొందరగా హిరణ్యకుడిని తీసుకొనిరా. అతను వచ్చాడంటే నా కట్లు తెగకొరికి నన్ను రక్షించగలడు" అన్నది జింక దానితో.

(...మిగతాది వచ్చేమాసం..)



కనువిప్పు

పద్యానికి కథ

రచన: యస్. భరత్, పదవ తరగతి, ప్రకృతి బడి.



ఇంద్రప్రస్థాన్ని ఒకప్పుడు కీర్తివర్మ అనే రాజు పరిపాలించేవాడు. కీర్తివర్మకు తన రాజ్యాన్ని విస్తరింప జేయాలని చాలా కోరికగా ఉండేది. ఆ రాజ్యానికి చుట్టుప్రక్కల ఉన్న చిన్న చిన్న రాజ్యాలపైకి అతను దండెత్తి , వాటినన్నిటినీ తన రాజ్యంలో కలుపుకున్నాడు. వాటిని సామంత రాజ్యాలుగా ఉంచుకొని, ఆ రాజుల నుండి బలవంతంగా కప్పం వసూలు చేయసాగాడు. సామంత రాజ్యాల ప్రతినిధులు తమ అశక్తతను ఎన్ని విధాలుగా వ్యక్తం చేసినా ఫలితం లేకపోయింది- కీర్తివర్మ కోరికలకు అంతులేకుండా ఉన్నది.

కొన్నాళ్లకు గూఢచారులనుండి కీర్తివర్మకు ఒక వర్తమానం అందింది: సామంత రాజులంతా కలిసి తనకు వ్యతిరేకంగా కుట్రపన్నుతున్నారు. అయినా కీర్తివర్మ ఏమాత్రం తొణకలేదు. తనకు సైనిక బలం ఎక్కువ ఉన్నదనే ధైర్యం ఆయన కళ్ళకు పొరగా

నిల్చింది. వాళ్లందరిపైనా మరోసారి యుద్ధం చేద్దామని నిశ్చయించాడు. మంత్రి, సైన్యాధిపతి అది తప్పని చెప్పిచూశారు. అయినా లాభం లేకపోయింది.

తెలివైన మంత్రి రాజుకు ఏదో ఒక విధంగా కళ్ళు తెరిపించాలనుకున్నాడు. దానికి తగిన సందర్భంకోసం వేచి ఉన్నాడు. అలాంటి అవకాశం త్వరలోనే వచ్చింది: రాజు, మంత్రి ఉద్యాన వనంలో విహరిస్తుండగా వాళ్లకొక వింత కనబడింది- ఒక మూలన ఉన్న పుట్టకు దగ్గరలోనే వేలాది చలి చీమలు ఒక పామును కరిచి చంపుతున్నాయి. పాము అటూ ఇటూ దొర్లుతున్నది- దానిక్రిందపడి అనేక చీమలు నలిగిపోతున్నాయి- అయినా మరిన్ని చీమలు వచ్చి ఆ పామును పట్టుకొని ఈడ్చుకు పోతున్నాయి. చివరికి ఆ పాము చనిపోయింది కూడా. ప్రక్కనే ఉన్న మంత్రి సమయానుకూలంగా ఈ పద్యం చెప్పాడు:

"బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ?" అని.

కీర్తివర్మకు కనువిప్పు కలిగింది. కేవలం తనకున్న సైన్యబలంపై ఆధారపడి, సామంతరాజ్యాలను దోచటం తప్పని అర్థమైంది. చిన్న చిన్నవైనా సరే, అవన్నీ కలిస్తే తనకు ముప్పు తప్పదని అతను తెలుసుకున్నాడు. సామంత రాజ్యాల కష్టాలను అర్థంచేసుకొని, ఆ రాజుల మనోభావాలకు దెబ్బతగలకుండా ప్రవర్తించాలని అతనికి తెలిసివచ్చింది.

ఆపైన అతను మంత్రిగారి సలహాల మేరకు అనేక పరిపాలనా సంస్కరణలు చేపట్టాడు. ప్రజా సంక్షేమం కోసం అతను చేపట్టిన చర్యలవల్ల, సామంత రాజులకు ఆందోళన మార్గం చేపట్టవలసిన అవసరమే లేకుండా పోయింది. అందరూ కీర్తివర్మకు మిత్రులైనారు. దట్టంగా క్రమ్ముకున్న యుద్ధ మేఘాలు దూదిపింజల్లాగా తొలగిపోయాయి.

తన కనువిప్పుకు కారణమైన మంత్రిని ఘనంగా సత్కరించాడు కీర్తివర్మ.



చదువు-సంస్కారం

రచన: బి. అనిత, పదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.



రామయ్య నడిపించే బడిలో చాలామంది పిల్లలు చదువుకొనేవాళ్ళు. కొందరు చక్కగా చదివేవాళ్ళు; అయితే మరికొందరు చదువుల్లో బాగా వెనకబడి ఉండేవాళ్ళు. రామయ్య తనవంతుగా అందరినీ సమానంగా చూసేవాడు. సరిగా చదవని పిల్లలకు ఎలాగైనా విద్యను అందించాలని ప్రయత్నించేవాడు.

రామయ్య బడిలో చదివే సిద్ధయ్య అలా బాగా వెనకబడిన పిల్లవాడు. ఎంత ప్రయత్నించినా వాడికి చదువు సరిగా అబ్బలేదు. అదే తరగతి పిల్లవాడు గణేశ భట్టు వాడిని పదే పదే ఎగతాళి చేసి ఆటపట్టిస్తుండేవాడు. దాంతో మనసు విరిగిపోయిన సిద్ధయ్య ఒకసారి బడిలోంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. సమయానికి అక్కడికి వచ్చిన రామయ్య అతన్ని ఆపి, కారణం అడిగాడు. "నేను చదువుకోను

సార్!" అన్నాడు తప్పిస్తే, సిద్ధయ్య భట్టుపై ఎలాంటి ఫిర్యాదూ చెయ్యలేదు.

ఇక చేసేదేమీ లేక, సిద్ధయ్య తండ్రిని పిలిపించి అతనికి సిద్ధయ్యను అప్పగించాడు రామయ్య. వెళ్ళేముందు తనకు నమస్కరించిన సిద్ధయ్యతో "నీకు చదువు రాలేదని బాధ పడకు. చదువు రాకున్నా పరవాలేదు-చదివే వాళ్ళను గౌరవించు. నీ మంచితనపు వన్నె తగ్గకుండా జాగ్రత్తగా కాపాడుకో" అని చెప్పాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత సిద్ధయ్య తండ్రి పొలంలోనే సేద్యం చేయసాగాడు. రానురాను అతనికి సేద్యంలో మెళకువలన్నీ బాగా అర్థమయ్యాయి. పంటల్ని మార్చి మార్చి వేసుకోవటం, నీటిని పొదుపుగా వాడటం, నేల పై పొరల్లోని సారాన్ని జాగ్రత్తగా సంరక్షించుకోవటం లాంటివి అతనికి చాలా నచ్చిన అంశాలు. అతను వాటినన్నిటినీ తన పొలంలో అమలుపరచి, బంగారం పండించాడు. తన ఇంటికి అవసరమైన పంటలు అన్నింటినీ అతను స్వయంగా పండించుకొని, ఊళ్ళో వాళ్లందరిచేతా 'శభాష్' అనిపించుకున్నాడు. చుట్టు ప్రక్కల అనేక గ్రామాల్లో రైతులకు వ్యవసాయపరంగా ఎలాంటి సందేహాలు వచ్చినా వాళ్లు సిద్ధయ్యను సంప్రతించేవాళ్ళు.

ఆ సమయంలో సిద్ధయ్య ఉండే ఊరికి ఒక పండితుడు వచ్చాడు. ఆయన గుళ్ళో ప్రవచనాలు ఇస్తున్నాడనీ, చక్కగా మాట్లాడతాడనీ విని, సిద్ధయ్య వెళ్ళి, ఆయన చెప్పే మంచి సంగతులన్నీ శ్రద్ధగా విన్నాడు. ఆ తరువాత ఆయనకు పట్టువస్త్రాలు, పండ్లు ఇంకా ఏవేవో ఇద్దామనుకొని దగ్గరకు వెళ్ళేసరికి, ఆయన వేరెవరో కాదు- చిన్ననాడు బడిలో తనని ఆట పట్టించిన గణేశభట్టు! సిద్ధయ్య అతని పాండిత్యాన్ని మెచ్చుకుని, చక్కగా మాట్లాడి, అతనికి సన్మానం చేసి నమస్కరించేసరికి, భట్టుకు ఆశ్చర్యం వేసింది. ఊళ్ళోవాళ్ళు సిద్ధయ్యను ఎంత గౌరవిస్తున్నారో చూసిన భట్టుకు తన చిన్ననాటి ప్రవర్తన గుర్తుకొచ్చి సిగ్గు వేసింది.

"నాకే చదువు వచ్చనే గర్వంతో నేను నిన్ను బడిలో చాలా అవమానించాను. నీ

సంస్కారాన్నీ , నీలో ఉన్న మంచితనాన్నీ గమనించని నన్ను క్షమించు సిద్ధయ్యా!" అన్నాడు అతను నీళ్ళు నిండిన కళ్ళతో.

"అలా అనకు మిత్రమా, పాండిత్యం పాండిత్యమే. నీ అంతటివాడు నా మిత్రుడని చెప్పుకోవటం నాకు గర్వకారణం, కాదూ?" అన్నాడు సిద్ధయ్య, అణకువతో.

మంచితనాన్ని మించిన చదువు లేదు.



పొడుపు కథలు

1. ఎంత వెతికినా కనబడనిది ఏమిటది?


2. గుప్పెడు పిట్టకు బారెడు తోక?

3. ఒకటి లేపితే రెండు ఊగులాడుతాయి?

4. ఇంతింతాకు పచ్చని ఆకు, రాజులు మెచ్చిన రత్నాలాకు ఏమిటది?

5. ఆ బాబూ ఈ బాబూ పోట్లాడితే, పకీరు సాయిబు వచ్చి తగవు తీర్చాడుట. ఏమా కథ?

సమాధానాలు 55 పేజీలో.



మూడు కథలు

ఇంతకీ "గాలిలో గాహనం" అంటే ఏంటి? మాకూ తెలీలేదు. అయినా శబ్దం బాగుందని దీన్ని అలాగే ఉంచేసాం. అర్థం మీకు తోచినట్లు మీరు ఊహించుకోండి...



రచన: సి. కృష్ణవేణి, ఆరవ తరగతి, టింబక్టు బడి.

అనేక సంవత్సరాల క్రితం కళింగ పుర రాజ్యాన్ని భీమరాజు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయనకు ఒక్కగానొక్క కుమారుడు అశోక వర్మ. యువరాజుకు మూడు కథలు వచ్చు. అయినా అతను ఆ కథల్ని ఎవ్వరికీ చెప్పలేదు. మనకు ఏవైనా కొత్త కథలు వస్తే అందరికీ చెప్పెయ్యాలి కదా!? యువరాజు మాత్రం ఎవ్వరికీచెప్పకుండా వాటిని తన మనసులోనే దాచిపెట్టుకున్నాడు. ఆ కథలకు మాత్రం ఎలాగైనా బయటికి వెళ్దామని ఉన్నది. 'ఎలాగా,' అని అవి అవకాశం కోసం చూస్తూ

ఉన్నాయి.

అంతలో యువరాజుకు పెళ్ళి నిశ్చయమైంది. ఇంకా రెండు రోజుల్లో అతని పెళ్ళి అనగా, ఆనాటి రాత్రి ఆ మూడు కథలూ కలిసి, 'ఎలా బయటపడాలి' అని చర్చించుకుంటున్నాయి: మొదటి కథ అంటున్నది- "ఈ యువరాజు ఇన్ని రోజులైనా మన గురించి ఏ ఒక్కరికీ చెప్పలేదు. కనుక ఈ యువరాజుకు పెళ్ళి జరగకుండా చూడాలి. రేపు పొద్దున యువరాజు అన్నం తింటూ మొదటి పిడస(ముద్ద)ను నోట్లో పెట్టుకుంటున్నప్పుడు, నేను గాలిలో గాహనం అయి అతన్ని చంపేస్తాను- చూస్తూండండి" అని.

ఇక రెండవ కథ అంటున్నది: "రేపు పొద్దున యువరాజు రథంలో పోతున్నప్పుడు, నేను ఆ కొండ దగ్గర నిల్చొని, ఒక పెద్ద గుండ్రాయిని రథం మీద వేస్తాను- చూడండి"అని.

అప్పుడు మూడవ కథ అంటుంది, "నేను మీ మాదిరి అతన్ని చంపను. పెళ్ళయిన మరునాడు, అతని తప్పు ఏమీ లేకుండానే అతను పదిమంది ముందూ తల వంచుకునేట్లు చేస్తాను" అని.

అవి 'మా మాటలు ఎవ్వరూ వినటంలేదు' అనుకున్నాయి- కానీ మరుగున నిల్చున్న మంత్రి కొడుకు రవిచంద్ర వాటి మాటల్నీ పూర్తిగా విని, "ఎలాగైనా నేను మా యువరాజుని కాపాడుకోవాలి" అనుకున్నాడు.

మరునాటి ఉదయం యువరాజు అన్నం తినేటప్పుడు రవిచంద్ర అతని ప్రక్కనే కూర్చున్నాడు. యువరాజు మొదటి పిడసను నోట్లోపెట్టుకుంటాడనగా రవివర్మ తటాలున ఆ పిడసను తనే లాక్కొని, జాగ్రత్తగా నమిలి మింగేశాడు. అతను చేసిన ఈ పనికి రాజుతో సహా అందరికీ చాలా కోపం వచ్చింది- "ఎందుకు, తినే పిడసను లాగేసుకున్నావు? రాజకుమారునితో ప్రవర్తించేది ఇలాగేనా?" అని కోప్పడ్డారు. "ఏమీ లేదు- ఏమీ లేదు. మీరు తినండి" అన్నాడు రవిచంద్ర అందరినీ శాంతపరచి. అలా మొదటి ప్రమాదం తప్పింది.

ఆ తర్వాత యువరాజు రథంలో ఊరేగింపుగా కల్యాణ మండపానికి

బయలుదేరాడు. దారిలో కొండ ఇంకా కొంచెం దూరంలో ఉందనగా రథం ఆపమన్నాడు రవిచంద్ర. యువరాజుతో "మిత్రమా! మనం ఇద్దరం ఇప్పుడు కొంచెం దూరం నడుద్దాం. ఎందుకు అని ప్రశ్నలు వేయకుండా నావెంట నడువు" అన్నాడు. 'సరే'అని, ఇద్దరూ నడుచుకుంటూ కొండను దాటేశారు. అలా రెండవ ప్రమాదం కూడా తప్పింది.

ఇక 'మూడవ ప్రమాదం ఏమై ఉంటుందా' అని అర్ధరాత్రి దాకా ఆలోచిస్తూ మేలుకొని ఉన్నాడు రవిచంద్ర. ఆ సమయంలో వంట గది వైపు నుండి ఏవో పాత్రల శబ్దం వినిపించింది. 'ఈ సమయంలో పాత్రల శబ్దం ఎందుకు వస్తున్నది?' అని అతను వెళ్ళి చూశాడు. అంత:పుర దాసి సీతమ్మ ఏదో దొంగ పని చేస్తున్నట్లుగా అటూ ఇటూ చూసుకుంటూ, కంగారుగా చేతికందిన పిండి వంటల్ని గిన్నెలో వేసుకొని, ఎక్కడికో పోతున్నది! రవిచంద్రకు ఆమెను చూడగానే అనుమానం వేసింది. దొంగచాటుగా ఆమెనే వెంబడిస్తూ పోయాడు.

పోయి పోయి, సీత రాజ భవనం ప్రక్కగా ఉన్న చిన్న సామాన్ల గదిలోకి పోయింది. 'ఈమెకు ఇక్కడ ఏం పని?' అని, మంత్రికొడుకు దాని కిటికీ ప్రక్కగా నిలబడి లోపలి చూడసాగాడు. లోపల, మొద్దు చేతులు, మొద్దు కాళ్ళు పెట్టుకొని ఒక శత్రు దేశపు గూఢచారి కూర్చొని ఉన్నాడు! సీతమ్మ వాడి దగ్గరికి పోగానే వాడు "మూడు రోజులుగా నాకు తిండి లేదు; కంటిమీద నిద్ర లేదు. యువరాజును చంపేందుకు పథకం చెబుతానని నన్ను ఊరించి, చివరికి నువ్వేమో అక్కడ హాయిగా తింటూ కూర్చున్నావా? ఇక్కడ నేనేం కావాలి?" అని పోట్లాట పెట్టుకున్నాడు. "లేదు, లేదు! నేను రావడానికి ఏమాత్రం వీలు లేకుండింది" అని సీతమ్మ ఎంత చెప్పినా వాడు వినలేదు. "నాదగ్గర అన్ని డబ్బులు తీసుకొని, నా పని చేయకుండా తప్పించుకుందామనుకుంటున్నావా?" అని, కోపంతో ఆమె ముక్కు ను కోసేశాడు వాడు. ఆమె ఏడ్చుకుంటూ అక్కడ నుండి వెళ్ళిపోయింది. ఆ వెంటనే రవిచంద్ర లోపలికి పోయి, ఆ గూఢచారితో యుద్ధం చేసి, వాడిని

త్రాళ్లతో కట్టి పడేసి, అక్కడే పడి ఉన్న సీతమ్మ ముక్కును జాగ్రత్తగా ఎత్తిపెట్టి, తను వెళ్ళి నిశ్చింతగా పడుకున్నాడు.

ఇక ఉదయాన్నే వేరొక దాసీ వచ్చి సీతమ్మను నిద్ర లేపింది. ఆమె పరుపు మీద అంతా రక్తపు మరకలు! వాటిని చూసి ఆమె భయపడి, "అయ్యో ,అయ్యో! ఎంత ఘోరం జరిగిందో చూడండి, ఎంత రక్తమో!" అని అరిచి అందరినీ పిల్చింది. అందరూ వచ్చి "ఏమైంది ఏమైంది?" అని అడగారు. సీతమ్మకు ఏం చెప్పాలో తోచలేదు- "నా ముక్కును యువరాజుగారు కొరికేశారు" అని భోరు-మన్నది ఆమె.

"మా రాజ్యంలో యువరాజుకొక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం ఉండదు. తప్పు చేసిన వాళ్ళెవరైనా సరే, శిక్ష పడుతుంది" అని రాజుగారు సభ ఏర్పాటు చేశారు. "నేను ఏపాపం ఎరుగను" అని యువరాజు ఎంత చెప్పినా ఎవ్వరూ నమ్మలేదు.

అప్పుడు రవివర్మ ముందుకు వచ్చి, యువరాజుగారికి వచ్చిన మూడు ప్రమాదాల గురించి చెప్పాడు. "మా యువరాజుకు మూడు కథలు వచ్చు. కానీ వాటిని అతను ఎవ్వరితోటీ పంచుకోలేదు. అందుకని అవి ఎలాగైనా అతనినుండి తప్పించుకు పోవాలనుకున్నాయి. ఒకటేమో గాలిలో గాహనమై వచ్చి యువరాజును చంపాలని ప్రయత్నించింది. రెండవది యువరాజు రథం మీద బండరాయిని వేసి చంపాలనుకున్నది. నేను యువరాజును ఆ రెండు ప్రమాదాల నుంచీ కాపాడాను .

ఇక మూడవది, 'యువరాజు ఏ తప్పూ చేయకుండానే అతను పదిమంది ముందూ తల వంచుకునేట్లు చేయాల'నుకున్నది. దాని ఫలితమే ఈ విచారణ. దీనిలో వాస్తవం ఏంటో నేను చెబుతాను వినండి. సీతమ్మకు ఒక శత్రుదేశపు గూఢచారితో సంబంధం ఉన్నది. యువరాజును చంపేందుకు పథకం చెప్పమని, వాడు ఆమెకు కొంత డబ్బు ఇచ్చి ఉన్నాడు. అయితే ఈమె చాలారోజులుగా వాడిని కలవలేదు- చివరికి నిన్న రాత్రి ఆమె వాడికోసం పిండి వంటలు తీసుకొని పోయింది. అక్కడ

వాడు ఆమెతో పోట్లాడి, చివరికి ఆమె ముక్కును కోసేశాడు. ఇదిగో చూడండి, ఆమె ముక్కు, ముక్కును కోసిన వాడూ-" అని తను తెచ్చిన ముక్కును, గూఢచారినీ చూపించాడు. అందరూ సీతమ్మ తెగింపుకు ఆశ్చర్యపోయారు. ఆమెకు, గూఢచారికి తగిన శిక్షవేశారు.


ఆపైన యువరాజు తనకు వచ్చిన కథల్ని ఆపుకునే ప్రయత్నం చెయ్యలేదు. కథల్ని అందరికీ చెప్పెయ్యటం అలవాటు చేసుకున్నాడు. యువరాజులో వచ్చిన మార్పుకు కథలూ చాలా సంతోషించాయి!



పొడుపు కథ

6. పిఠాపురం చిన్నవాడ
పిట్టలు వేటాడేవాడ
బతికినపిట్ట లు కొట్టొద్దు
చచ్చిన పిట్టలు కొట్టొద్దు
కూరకు ఏమితెస్తావు ?
ఊరికే ఇంటిరానూ వద్దు
వచ్చావంటే తంతా తంతా తంతా,
ఏమి తెస్తావు నువ్వేమితెస్తావు?

సమాధానం 55 పేజీలో.



చెట్లు -కట్టెలు

రచన: టి. నాగమణి, ఆరవ తరగతి, టింబక్టు బడి.



ఒక ఊరిలో రంగయ్య అనే పేదవాడు ఒకడు ఉండేవాడు. కట్టెలు కొట్టుకొని జీవించేవాడు రంగయ్య. ఎంత కష్టపడినా, వ్యాపారం మాత్రం సరిగ్గా జరిగేది కాదు. బ్రతుకు తెరువు కష్టంగా ఉండటంతో రంగయ్య ఆ పని మానేసి వేరే పని ఏదైనా వెతుక్కుందామని ఆలోచించసాగాడు. సరిగ్గా అదే సమయంలో అతని అదృష్టం పల్టీ కొట్టింది.

ప్రతి రోజూ లాగే రంగయ్య ఒక రోజున కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్ళాడు. అతను కట్టెలు కొడుతూ ఉంటే ఎవరో పిలిచినట్టు అనిపించింది. అటూ ఇటూ చూశాడు రంగయ్య. ఎవరో "ముందుకెళ్ళు ముందుకెళ్ళు" అంటున్నారు! అంతకు ముందు కూడా రంగయ్యకు అలా వినబడేది కానీ ఎప్పుడూ దాన్ని పట్టించుకోలేదు. ఆనాడు

మాత్రం అతను ఒక క్షణం ఆలోచించి, "సరే, ముందుకెళ్తే ఏం జరుగుతుందో చూద్దాం" అని చెప్పి, ముందుకెళ్ళాడు. కొంత దూరం వెళ్ళి చూసేసరికి, అక్కడ ఎండు కట్టెల కుప్ప ఒకటి కనిపించింది! రంగయ్య వాటిని చిన్నగా తెగకొట్టుకొని ఊరిలో అమ్మితే, ఆ ఒక్కరోజునే వంద రూపాయలు వచ్చింది! రంగయ్య ఆరోజున చాలా సంతోషంగా ఇంటికి వెళ్ళాడు.

మరుసటి రోజున రంగయ్య కట్టెలు కొడుతుండగా, ఎవరో మళ్ళీ "ముందుకెళ్ళు ముందుకెళ్ళు"అంటున్నారు.రంగయ్య "సరే, వీళ్లెవరోగానీ నాకు మేలు చేసేందుకే చెబుతున్నట్లున్నారు నిన్నటిలాగే నాకు ఇవాళ్లకూడా ఏదైనా లాభం కలుగుతుందేమో" అని ముందుకెళ్ళాడు. చూడగా ఆ వైపున అడవిలో పెద్ద పెద్ద టేకు చెట్లు,చందనం చెట్లు కనిపించాయి. రంగయ్య కు "భలే, భలే" అనిపించింది. "నేను వాటిని అన్నిటినీ కొట్టుకొని అమ్ముకుంటే చాలా డబ్బులు వస్తాయి" అని అనుకొని, ఒక చెట్టును మొదలుకంటా కొట్టుకొని, అమ్ముకొని సంతోషంగా ఇంటికి వెళ్ళాడు.

మరుసటి రోజున అతను ఉత్సాహం పట్టలేక, ఇంకా తొందరగా అడవికి బయలుదేరాడు. అడవిలో తనకు టేకు చెట్లు కనబడ్డ చోటుకు పోయి ఒక చెట్టును కొట్టటం మొదలుపెట్టాడో లేదో "ముందుకెళ్ళు ముందుకెళ్ళు!"అని వినిపించింది. అతను ఈసారి ఇంకా సంతోషంగా ముందుకెళ్ళాడు. అక్కడ ఒక చెట్టు మొదట్లో అతనికి ఒక పెద్ద నిధి కనిపించింది. అందులో బంగారం, వెండి, వజ్రాలు, మాణిక్యాలు ధగ ధగా మెరుస్తున్నాయి. వాటిని చూడగానే మన రంగయ్యకు కూడా కళ్ళు తళుక్కుమన్నాయి. వాటిని అమ్ముకొని రంగయ్య ఆ ఊరిలోనే పెద్ద ధనవంతుడయ్యాడు.

అయినా ఇప్పటికి కూడా రంగయ్య కట్టెలు కొట్టడం మాత్రం మానలేదు. అయితే కట్టెలు ఇకపైన కొట్టినప్పుడల్లా ఎవరైనా "ముందుకెళ్ళు ముందుకెళ్ళు" అంటారేమో అని ఎదురు చూడటం మొదలు అయింది.. ఒకటి రెండుసార్లు అతనికి ఆ మాటలు

వినబడ్డాయి కూడా. కానీ తీరా చూస్తే ఏలాంటి లాభమూ లేదు. రాను రాను రంగయ్య ఆ మాటల్ని పట్టించుకోవటం మానేశాడు. కొన్నాళ్లకు అతనికి ఆ మాటలు వినబడటమూ ఆగిపోయింది.

అయితే రంగయ్యకు అట్లా "ముందుకు వెళ్ళు" అని చెప్పింది ఎవరు? ఆ ప్రాంతపు చెట్లే! "మమ్మల్ని కొట్టద్దు,ముందుకు వెళ్లు!" అని చెప్పాయి అవి! వాటిని రంగయ్య వేరేగా అర్థం చేసుకున్నాడు ఇక నిధులు టేకు చెట్లూ యాదృచ్చికంగా తగిలినవే!



పొడుపు కథలు

7. ఒక పచ్చ కుండలో ఒక కాయ , ఆ కాయ మధ్యలో నల్లటి విత్తనాలు ఏంటది?

8. పచ్చని కుండలో చిన్న చిన్న కాయలు, దాంట్లో చిన్న చిన్న నల్లని విత్తనాలు ఏమిటది?


9. పచ్చని కుండలో తెల్లకుండ, తెల్లనికుండలో నీళ్ళు ఏంటవి?

సమాధానాలు 55 పేజీలో.

అడవులు



రచన: కె. భార్గవి, ఆరవ తరగతి, టింబక్టు బడి.



అనగా అనగా కళింగ రాజ్యాన్ని విజయ వర్మ అనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఆయన ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకునే వాడు. కానీ ఆయనకు ఒకటే చింత. సంతానం లేదు. సంతానంకోసం రాజు-రాణి నోచని నోము లేదు, తిరగని చోటు లేదు. చివరకు ఒక సన్యాసి "నువ్వు మహారాజువు. రాజన్నవాడు స్వార్థాన్ని పక్కన పెట్టి, ప్రజలకోసం జీవించాలి. నువ్వు ఇలా సమయాన్ని వృధా చేసుకోనవసరంలేదు. నీ పరిపాలనను నువ్వు సరిగా చేస్తే, నీ కుటుంబ బాధ్యతను ఆ భగవంతుడు తీసుకుంటాడు" అని ఉపదేశించాడు.

రాజు రాణి వెనక్కి తిరిగి వచ్చేసరికి, రాజ్యంలో తెలీని అంటువ్యాధి ఒకటి ప్రబలింది. ఒక్కరొక్కరుగా ప్రజలు అందరూ చనిపోసాగారు. రాజ్యంలోని వైద్యులు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండింది. రాజుగారు వైద్యుల సమావేశం ఏర్పరచి, రోగానికి నివారణను సూచించమన్నాడు.

వైద్యులు అన్నారు -"ప్రభూ! ఇది చాలా విచిత్రమైన వ్యాధి. ఇది నయం అవ్వాలంటే 'అమృత వల్లి' అనే మూలిక కావాలి. కానీ ఆ మూలిక అన్ని చోట్లా దొరకదు. భయంకర నిశారణ్యంలో ఉంటుంది అది. ఆ అరణ్యంలో ఒక రాక్షసుడు ఉంటాడు. అతను చాలా క్రూరుడు. ఆ అరణ్యం లోపలికి వెళ్ళిన మానవుడెవ్వడూ ఇంతవరకు బయటికి రాలేదు. సాహసయోధులెవరైనా ఆ రాక్షసుడిని చంపి, మూలికను ఏ కొంచెం తెచ్చినా సరే,

మన రాజ్యంలోని ప్రజలందరికీ శాంతి లభించగలదు. ఇది తప్ప మాకు వేరే మార్గం ఏదీ తోచటం లేదు" అని.

వెంటనే విజయవర్మ రాజ్యమంతటా దండోరా వేయించాడు- "నిశారణ్యంలోకి వెళ్ళి 'అమృత వల్లి'మూలికను ఎవరైతే తెస్తారో, వాళ్లకు వెంటనే రాజ్యంలో సగభాగం దక్కుతుంది. అంతేకాక వాళ్లే రాజ్యానికి వారసులుగా గుర్తింపబడతారహో!" అని.

ఈ ప్రకటనను విని ఎంతో మంది వీర యువకులు నిశారణ్యానికి వెళ్ళారు. కానీ అలా వెళ్ళిన వాళ్లలో ఏ ఒక్కరూ తిరిగి రాలేదు. సమయం గడిచేకొద్దీ రాజ్యంలోవ్యాధి ప్రబలుతున్నది.

ఇదంతా చూసి విజయ వర్మకు సన్యాసి బోధన గుర్తుకు వచ్చింది. అతను భార్యతో "రాణీ! కాలం గడిచిపోతున్నది- కానీ అమృతవల్లి దొరకటం లేదు. వెతికేందుకు వెళ్ళిన వీరయోధుల జాడ తెలియటం లేదు. ఇక నేనే స్వయంగా వెళ్ళి ఆ మూలికను తీసుకు వస్తాను" అన్నాడు. రాణి అతన్ని వారించింది. కానీ విజయవర్మ పట్టు వీడలేదు. "రాణీ! ప్రజలు సుఖంగా లేనప్పుడు రాజు సుఖంగా ఉండడు. 'ప్రజల్ని రాజు పట్టించుకుంటే, రాజును భగవంతుడు పట్టించుకుంటాడు' అని గురువాక్యం- గుర్తులేదా? ఇది ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనుకుందాం" అని చెప్పి, ఆమెను ఒప్పించాడు.

తన వెంట ఒక తెల్ల గుర్రాన్ని తీసుకొని, అందరూ నిద్రపోయేంత వరకూ ఆగి, అప్పుడు తన ప్రయాణం మొదలుపెట్టాడు. గుర్రాన్ని తూర్పు దిశగా పోనిచ్చాడు. సూర్యోదయం కావస్తున్నది. విజయవర్మ నేరుగా నిశారణ్యాన్ని చేరుకొని, గుర్రాన్ని ఒక చెట్టుకు కట్టేసి, మూలికను వెతుకుతూ తిరుగసాగాడు. అల్లంత దూరంలో రాక్షసుడు తపస్సు చేస్తూ కనిపించాడు.

రాజుకు ఆశ్చర్యం వేసింది. "రాక్షసులు దుర్మార్గులంటారు కదా, ఇలా తపస్సు చేస్తున్న వీడు, రాక్షసుడు అయి ఉండడు- ఈ అడవిని కాపాడే ఏ వనదేవతో ఈ రూపంలో

కనబడుతున్నట్లుంది" అనుకున్నాడు. వనదేవతలపైకి కత్తిని ఎత్తకూడదు- కనుక రాజు ఆ రాక్షసుడి ముందుకు వెళ్ళి నిర్భయంగా కూర్చున్నాడు. ఇంతలో రాక్షసుడు "నరవాసన- నరవాసన!" అంటూ కళ్ళు తెరిచాడు. వికృతంగా నవ్వుతూ "నీకెంత ధైర్యంరా!? ప్రాణాల మీద ఆశ ఉన్నట్లు లేదు. ఏకంగా నాముందుకే వచ్చి కూర్చున్నావు!?" అన్నాడు.

అప్పుడు రాజు వినయంగా "అయ్యా! ఈ వనంలో అమృత వల్లి అనే మూలిక ఒకటి ఉన్నదట. ఆ మూలిక సర్వరోగాలనూ హరిస్తుందట. నేను ఈ రాజ్యానికి రాజును. మా ప్రజల ఆరోగ్యసంరక్షణకు ఆ మూలిక తప్ప వేరే దారి లేదు. దయచేసి ఆ మూలికను నాకు ఇవ్వండి" అన్నాడు.

"ఓహో! నువ్వేనా, రాజువు!? ఇంతమంది ప్రాణాలతోఆడుకున్నావే? వీరులట, వీరులు- నాముందు ఎవ్వరి శక్తులూ పనిచెయ్యవు- మూలికకోసం వచ్చినవాళ్ళందరూ నా పాలబడ్డారు. ఇప్పుడు ఇక నీవంతు వచ్చింది. నాకు బాగా ఆకలిగా ఉంది. సరైన సమయానికే వచ్చావు!" అన్నాడు రాక్షసుడు అడుగు ముందుకు వేస్తూ.

"అయ్యా! మా ప్రజలకు మూలిక చాలా అవసరం. దాన్ని ఎలాగైనా సాధించే బాధ్యత, రాజుగా- నాదే. మీరు నన్ను నమ్మి, దాన్ని నాకు ఇవ్వండి. కావాలంటే, దాన్ని మా రాజ్య ప్రజలకు ఇచ్చి, తిరిగి వచ్చాక మీకు ఆహారమౌతాను" అన్నాడు విజయవర్మ.

రాక్షసుడు నవ్వి "నీ మాటలు నేను నమ్మాలా !?"అన్నాడు వెటకారంగా. అయినా రాజు ఓపికగా తను చెప్పాల్సింది తను చెబుతూ వచ్చాడు. చివరికి రాక్షసుడు ఒప్పుకున్నాడు- "నీకు కేవలం 5 గంటలు మాత్రమే సమయం ఉంది. ఈ లోపు నువ్వు తిరిగి రాకపోతే నీ రాజ్యంలోని ప్రజలందరినీ తినేసి, నీ రాజ్యాన్ని నాశనం చేస్తాను" అని బెదిరించి, తానే స్వయంగా మూలికను తెచ్చి రాజుకు ఇచ్చాడు.

విజయవర్మ వెంటనే ఆ మూలికను తీసుకొని వెళ్ళి, రాజ్య వైద్యులకు ఇచ్చాడు. జరిగిందంతా తన భార్యకు చెప్పి, "మనకు

ఎలాగూ సంతానం లేదు. నేను ఆ రాక్షసుడికి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అడవికి వెళ్ళవలసి ఉంది. నువ్వు రాజ్యానికి ఉత్తరాధికారిగా తగినవారిని నియమించి, ఆ తరువాత వనాలకు పో" అని వేగంగా నిశారణ్యం చేరుకున్నాడు.

రాక్షసుడు అక్కడే రాజుకోసంఎదురు చూస్తున్నాడు. విజయవర్మ అతన్ని చేరుకొని, అతను తనపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు చెప్పి, "ఇప్పుడు మీరు నన్ను భుజించండి, నేను సిద్ధం"అన్నాడు.

ఆ మాటలు వినగానే రాక్షసుడు బిగ్గరగా నవ్వాడు. "రాజా! మీ మనుషులు అడవుల్ని అనేక రకాలుగా నాశనం చేస్తున్నారు. ఆరోగ్యాల్ని ప్రసాదించే మూలికలపేరుతో కూడా అడవుల్ని కొల్లగొడుతున్నారు. దుష్ట మానవులనుండి అడవుల్ని కాపాడేందుకు, మేం- వనదేవతలం- ఇలా రాక్షసుల లాగాను, పులులు-సింహాల రూపంలోను తిరుగాడుతూ ఉన్నాం- కనీసం మమ్మల్ని చూసి భయపడి అయినా, మనుషులు అడవుల్ని వాటి మానాన వాటిని ఉండనిస్తారేమోనని. నువ్వు చక్కని రాజువు. నీలాంటి మంచిరాజులు వనసంరక్షణకు నడుంబిగిస్తే, మాకు పని తగ్గుతుంది. ఏమంటావు?" అన్నాడు.

విజయవర్మ అందుకు ఒప్పుకున్నమీదట, అంతకుముందు తను బందీలుగా ఉంచుకున్న వీరయోధులనందరినీ వదిలిపెట్టి, రాక్షసుడు అంతర్ధానం అయిపోయాడు. తిరిగి వచ్చిన విజయవర్మ ను, వీరయోధులను చూసి రాజ్యప్రజలందరూ ఎంతో సంతోషించారు. రాజు వనదేవతకు ఇచ్చిన మాటను నిలిపేందుకు గాను, వాళ్లంతా ఆ రోజునుండే వనసంరక్షణకు పూనుకున్నారు.

ఆపైన కళింగ రాజ్యం అంతటా చెట్లు,చేమల రూపంలో ఆరోగ్యం వెల్లివిరిసింది. త్వరలోనే రాణికి పండంటి బిడ్డడు కూడా పుట్టాడు!



మంచితనం

సేకరణ: కె. వాణి, ఐదవ తరగతి, టింబక్టు బడి.



సీతాపురం అనే గ్రామంలో రాము, సోము అనే అన్నదమ్ములు ఇద్దరు ఉండేవాళ్లు. వాళ్ళ తండ్రి చనిపోతూ-చనిపోతూ "మీరిద్దరూ పొలాల్ని,ఇండ్లను సమానంగా పంచుకోండి" అని చెప్పి చనిపోయాడు.

రాముకు కొంచెం గడుసుతనం ఎక్కువ. సోము అమాయకుడు. ఎలాగైనా సోమూని మోసం చేయాలనుకున్నాడు రాము. అందుకని పంపకాల సమయంలో కాబట్టి సోముకి చౌడు నేల ఇచ్చి, రాము మాత్రం ఎర్రనేలను తీసుకున్నాడు. సోము ఆ చవుడు నేలనే దుక్కి చేద్దామనుకొని పని

ప్రారంభించగానే, పొలంలో ఒక చోట నాగలి విరిగిపోయింది. 'ఏమిటా' అని త్రవ్వి చూస్తే, అక్కడ తాతల నాటి లంకె బిందెలు దొరికాయి! రాముకు ఆ విషయం తెలిసి, వాటిలో తనకూ వాటా కావాలని పోరు పెట్టాడు. అమాయకుడైన సోము "దానిదేముంది అన్నా, ఈ సంపద నీది మాత్రం కాదా?" అని, వాటిలో సగం పంచి ఇచ్చాడు.

అయినా రాముకు ఆశ చావలేదు. తమ్ముడు పొలంలో బోరు వేసి, పంట వేయగానే, ఆ బోరు ప్రక్కనే తను ఇంకొక బోరు వేయటం మొదలు పెట్టాడు. 'కొంచెం దూరంగా వేయరాదా అన్నా?' అని తమ్ముడు అడిగితే, "నీ బోరుకేమీ అవ్వదులే" అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. అయితే, ముప్ఫై వేల రూపాయలు ఖర్చు పెట్టినా, ఆ బోరులో నీళ్ళు పడలేదు. తమ్ముడిని చెడపాలనుకున్న రాము తేలు కుట్టిన దొంగ చందాన, కిక్కురు మనలేదు.

ఆపైన ఇద్దరూ పొలంలో పంట వేశారు. రాము పొలంలో పంట చాలా బాగా వచ్చింది. అయినా అతను ఆ దిగుబడిని సోము ఫలసాయంతో పోల్చుకొని కుమిలి పోయాడు. ఇద్దరూ పంటను కోసి వాములు వేశారు. ఆ సమయంలో రాము ఎలాగైనా తమ్ముడి పంటకు నిప్పుపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

ఒకనాటి అర్ధరాత్రి సోము లాంతరు చేతిలో పట్టుకొని తమ్ముడి వాము దగ్గరికి పోయాడు. దానికి నిప్పు పెట్టాలనుకునే సరికి, అక్కడ కాపలాగా ఉంచిన కుక్క మొరగటం మొదలు పెట్టింది. "ఎవరదీ?" అని సోము లేచి వచ్చాడు. దాంతో రాము గబుక్కున తన చేతిలోని లాంతరును ఆపేసి, పరుగున అక్కడే ఉన్న ఒక పొద చాటున దాక్కున్నాడు. అయితే అతని ఖర్మమో అన్నట్లు, అక్కడే ఉన్న పాము అతన్ని కరిచింది. ప్రాణాలు కడబట్టి పడిపోయి, నురగలు కక్కుతున్న అన్నను తమ్ముడే ఎత్తుకొని, వైద్యుని దగ్గరికి పరుగు తీశాడు. అయితేనేమి? బాగయ్యేటప్పటికి రాముకు వెయ్యిరూపాయలు ఖర్చయ్యాయి!

అయినా రాముకు తమ్ముడి మీద అసూయ తగ్గలేదు. తనకు అడ్డుగా నిలిచిన

కుక్కను ఎలాగైనా చంపాలనుకున్నాడు వాడు. ఒకరోజు ఉదయం సోము కట్టెలకోసం అడవికి పోయినప్పుడు, రాము అన్నంలోకి పురుగులమందు కలిపి, కుక్క ముందు ఉంచి వెళ్ళిపోయాడు. అయితే ఆ వాసనను గ్రహించిన కుక్క, దాన్ని తినక, దాన్ని తన్ని క్రింద పడేసింది. రాముకి కోళ్ళు చాలా ఉన్నాయి. అవి గింజలు వెతుక్కుంటూ వచ్చి, కుక్క వదిలేసిన అన్నం మెతుకులను తిన్నాయి. దాంతో, సాయంత్రానికి ఆ కోళ్ళన్నీ చనిపోయాయి. "కుక్క చనిపోయి ఉంటుంది" అని సంతోష పడ్డ రాముకు, తన కోళ్లన్నీ చనిపోయాయన్న వార్త తెలిసి గుండె ఆగినంత పనైంది.

"ఎవరు తీసిన గోతిలో వాళ్ళే పడతారు- ఇతరుల చెడును ఆశించకూడదు"అని ఆలస్యంగానైనా సరే, తెలుకున్నాడు రాము. తమ్ముడి దగ్గరకు వెళ్ళి తన తప్పులన్నీ ఒప్పుకొని క్షమాపణ కోరాడు. "అవేమీ మనసులో పెట్టుకోకు అన్నా! మనంఇద్దరం ఒకటే అనుకో" అని తమ్ముడు తన మంచినే పంచాడు. తమ్ముని వ్యక్తిత్వంలో గొప్పదనాన్ని గుర్తించిన రాము, ఆ నాటినుండి సోము బాటలో నడిచాడు.

పొడుపు కథలు

10. కాళ్ళు లేకున్నా నడుస్తుంది. కళ్ళు లేకున్నాఏడుస్తుంది. ఏమిటది?

11. చల్లచల్లని మంచం, ఎంత ఎక్కినా అణగదు. ఏమిటది?

12. రాత్రి చాపుకుంటుంది ,పగలంతా ముడుచుకుంటుంది. ఏమిటది?

13. రంధ్రాల గుర్రం ఎంతమందినైనా మోస్తుంది. ఏంటది?

సమాధానాలు 55 పేజీలో.



తెలివి తక్కువ పులి

(మీకు పులి భాష వచ్చా? మాకైతే రాదు. కానీ అశోక్ రాసిన కథలో రాము, రవిలు పులితో మాట్లాడి తెలివిగా దాన్ని బుట్టలో (కాదు త్రాళ్ళలో) పడేసుకున్నారు. చదవండి మరి.)



రచన: ఎన్. అశోక్, ఎనిదవ తరగతి, ప్రకృతి బడి.

అనగా అనగా ఒక అడవికి దగ్గర్లో ఒక ఊరు ఉండేది. ఆ అడవిలో ఒక పులి నివసిస్తూ ఉండేది. ప్రతిరోజూ అది ఊరి మీద పడి, దొరికిన మనుషులనల్లా చంపి తినేది. ఊరి ప్రజలెవ్వరూ దాని దాటికి తట్టుకోలేక-పోయారు. అందరూ కలిసి ఊరి పెద్ద దగ్గరికి వెళ్లి, తమ కష్టాలు చెప్పుకున్నారు. ఆ ఊరి పెద్ద అప్పుడు ఇలా చాటింపు వేయించాడు:"పులిని ఎవరైతే బంధించి తెచ్చిస్తారో వాళ్ళకు వెయ్యి రూపాయలు బహుమానం ఇస్తాను" అని. బహుమానానికి ఆశపడి దగ్గర గ్రామాల్లోని వీరులందరూ పులిని పట్టుకునేందుకు చాలా

ప్రయత్నించారు- కానీ ఎవ్వరూ దాన్ని బంధించలేకపోయారు.

ప్రక్క ఊళ్లో నివసించే రత్నమ్మకు రాము,రవి అనే ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. వాళ్లిద్దరికీ 13 సంవత్సరాలే. వాళ్ళు చాలా తెలివైన పిల్లలు. వాళ్ళకు చాలా భాషలు వచ్చు కూడా. వాళ్ళకు వచ్చిన ఒక భాష, పులి భాష. పొరుగూరి పెద్ద వేయించిన చాటింపు విని, వాళ్లకు ఎలాగైనా పులిని బంధించాలని ఆలోచన వచ్చింది. ఇక వాళ్ళిద్దరూ రెండు గట్టి తాళ్ళను తీసుకొని, తినేందుకు భోజనం మూట గట్టుకొని, బయలుదేరారు.

వాళ్ళు అడవిలోకి చేరుకునేటప్పటికి, పులి ఒక జింకను పట్టుకొని తింటూ కనిపించింది. వీళ్లను చూడగానే వీళ్లు తనను పట్టుకునేందుకు వచ్చినవాళ్ళు అని అర్థమైంది పులికి.అది కోపంతో గర్జిస్తూ అది వీళ్ల మీదికి దూకబోయింది.

రాము, రవి ఇద్దరూ చాలా ధైర్యం ఉన్నవాళ్ళే- అందుకని వాళ్ళు పులంటే అస్సలు భయపడలేదు. వాళ్ళు అలా నిబ్బరంగా ఉండటం చూసి పులే ఆశ్చర్యపోయింది. అప్పుడు రాము దానితో పులిభాషలో "ఏమ్మా, పులీ! ఆకలిగా ఉన్నట్లున్నావే, ముందు ఆ జింకను తినటం పూర్తి చెయ్యి. ఆ తర్వాత మమ్మల్ని తిందువులే. ప్రస్తుతం మా దగ్గర మా ఎముకలు మాత్రమే ఉన్నాయి- కండలేదు. నిన్న దారిలో పోతుంటే ఇంకో పులి కనబడి, మా కండ కావాలని అడిగింది. 'నీకెందుకు శ్రమ, మేమే ఇచ్చేస్తాం' అని మేం మా కండను దానికి ఇచ్చేశాం. మా కండదేముంది- రెండు రోజుల్లో తిరిగి తయారవుతుంది గదా" అన్నాడు.

పులి ఇంకా ఆశ్చర్యపోయింది. 'వీళ్ళకు పులిభాష ఎలావచ్చు?' అని. అది వాళ్ళను ముట్టుకొని చూస్తే, నిజంగానే వీళ్లిద్దరికీ పెద్దగా కండ లేదు. 'కండ ఎక్కడుంటుందిలే, పులికి ఇచ్చేశాం కద!' అన్నాడు రవి దానితో, మళ్ళీ.

'నిజంగానా, మీ కండ రెండు రోజుల్లో పెరిగిపోతుందా, ఎలాగ?' అని అడిగిందది. "ఏముంది, బాగా అన్నం తింటే సరి! మేం నిన్న తిన్నాం కద, అందుకనే ఈ మాత్రం వచ్చింది.

ఇవాళ్ళకూడా తిన్నామంటే, ఇక కండే కండ" అన్నాడు రాము, నమ్మకంగా.

"అయితే తినండి, తినండి. మీక్కూడా కొంచెం జింక మాంసం ఇవ్వమంటారా, ఇంకా బాగా కండ పడుతుంది?" అన్నది పులి, సంబర పడిపోతూ.

"అయ్యో, పచ్చి మాంసం తింటే కండ పట్టటం కష్టం. మేం అన్నం తెచ్చుకున్నాంలే. అది సరిపోతుంది. మేము ఇక్కడే, నీ ముందరే భోజనం చేస్తాము. అప్పుడు మాకు బాగా కండ పడుతుంది. ఆ తర్వాత నీక్కావలసినంత కండ నీకు ఇచ్చేస్తాం" అని చెప్పి రాము, రవి తాము తెచ్చిన తాళ్ళను నేలమీద పరిచారు.

వీళ్లను చూసి పులికి చాలా సంతోషం వేసింది. అది వాళ్ళతో అవీ-ఇవీ మాట్లాడుతూ క్రింద కూర్చోబోయింది. వాళ్ళు దాన్ని వారిస్తూ "అయ్యయ్యో, ఆగండి. మీరు పెద్దవాళ్ళు- అట్లా నేలమీద కూర్చోకూడదు. మేం మీకోసం చాప వేస్తాము" అని చెప్పి, నేలమీద త్రాళ్ళు పరిచి, దానిమీద అక్కడే ఉన్న పచ్చి ఆకులు వేసి, పులిని తాళ్ళ మీద కూర్చోబెట్టారు.

పులి ఆ త్రాళ్ళమీద పడుకొని, "ఈ రోజు నాకు బాగా కండ ఉన్న మాంసం దొరకబోతోంది. బాగా తినండి, తినండి! తొందరగా తినండి ! నాకు చాలా ఆకలిగా ఉన్నది" అని చెబుతూ ఒక్క క్షణంపాటు సంతోషంగా కళ్ళు మూసుకున్నది. అదే సమయం కోసం ఎదురుచూస్తున్న రాము,రవిలు ఒక్క ఉదుటున లేచి దాన్ని తాళ్ళతో బంధించేశారు.

"అయ్యో, అయ్యో! ఇదేంటి?" అన్నది పులి.

"ఏమీ లేదు తల్లీ, నువ్వేమో మనుషుల కండనే తినాలంటున్నావు. మనుషులేమో మమ్మల్ని కాపాడమంటున్నారు. మరి మేం ఏం చేయాలి, నువ్వే చెప్పు?" అన్నారు వాళ్లు.

"అలాకాదు- నేనుండే అడవిలోకి మనుషులు వచ్చేస్తుంటే, చెట్లన్నీ కొట్టేస్తుంటే, నాకు జంతువులు దొరక్కుండా చేస్తుంటే, మీరే చెప్పండి మరి, నేనేం చెయ్యాలి?" అన్నది పులి.

"నీకేం అవ్వదులే, నిన్ను తీసుకెళ్ళి అభయారణ్యంలోనైనా పెడతారు, లేకపోతే ఏ

జంతు ప్రదర్శన శాలలోనైనా పెట్టి నీకు కడుపు నిండేలా చూస్తారు- ఊరికే ఉండు" అని రాము, రవి ఇద్దరూ దాన్ని పట్టుకొని పోయి ఊరిపెద్దకి అప్పజెప్పారు.

గ్రామపెద్ద, అటవీశాఖ వాళ్ళను పిలిచి వాళ్ళకు పులిని అప్పగించాడు. రాము, రవి తమకు వచ్చిన వెయ్యి రూపాయల బహుమానాన్ని "జంతునిధి"లో వేసుకున్నారు!



పొడుపు కథలు

14. పాలు ఉన్నై, కానీ బాలింత కాదు

పిల్లలందర్నీ పక్కనేసుకొని పచ్చగా ఉంటుంది ఏమిటది?

15. కోటుమీద కోటు

కోటు మీద కోటు

కోటు తీస్తే ఏడుపొచ్చె ఏంటది?


16. వెయ్యికండ్ల పులి వేటకు వెళ్లింది ఏంటది?

17. చందమామ దూరమా, చైనా దూరమా?

చైనానే.

ఎందుకు?

సమాధానాలు 55 పేజీలో.



పూర్తిగా వాడదాం



సేకరణ: జి. సుచరిత, కొత్తపల్లి బృందం.

బుద్ధుడు ధర్మ ప్రచారం చేస్తూ దేశమంతటా తిరుగుతున్న రోజులవి. బుద్ధునికి ఆసరికే లెక్కలేనంతమంది శిష్యులు ఉన్నారు. ఊరూరా బౌద్ధ ఆరామాలు వెలిశాయి. ఆ ఆరామాలలో బౌద్ధసన్యాసులు నివసిస్తూ ఉండేవాళ్ళు. భోజనంకోసం ఊళ్లో భిక్షాటన చేసేవాళ్ళు. వాళ్ళ కనీస అవసరాలనుమాత్రం ఆరామాలు తీరుస్తుండేవి. బుద్ధుని సూత్రాలలో ఒకటి, పొదుపుగా జీవించటం: ఏ వస్తువునైనా సరే- సరిగ్గా, పొదుపుగా, శ్రద్ధగా ఉపయోగించుకోవటం, దేనినీ పారెయ్యకుండా పూర్తిగా వాడుకోవటం- ఆయన పెట్టుకున్న నియమాలలో ఒకటి.

ఒకనాడు బుద్ధుడు అలా ఒక ఊరిలోని ఆరామాన్ని సందర్శిస్తుండగా ఆయనకు ఒక వృద్ధ సన్యాసి ఎదురుపడ్డాడు.

"బాగా చలిగా ఉంటున్నది- ఇక్కడ చలికాలంలో ఎముకలు కొరికే చలి. పైన

కప్పుకునేందుకు శాలువా లేక, కష్టంగా ఉన్నది. మీకు వీలైతే, నాకు ఒక కొత్త ఉన్ని శాలువా ఇప్పించండి" అని అడిగాడాయన.

బుద్ధుడు అతన్ని అడిగాడు -"నీ పాత శాలువా ఏమైంది?" అని.

"వాడగా-వాడగా అది పాతదైపోయి, చినిగి పోయింది. ఇప్పుడు నేను దానిని దుప్పటి లాగా వాడుకుంటున్నాను" అని సమాధానం ఇచ్చాడు సన్యాసి.

"కానీ అంతకు ముందే నీ పాత దుప్పటి ఒకటి ఉండి ఉండాలి గద, అది ఏమైపోయింది?" అడిగాడు బుద్ధుడు.

"గురువు గారూ! వాడగా, వాడగా ఆ దుప్పటి పాతది అయిపోయి, చినిగి పోయింది. అందుకని నేను ఇప్పుడు దాన్ని కత్తిరించి దిండు కవరుగా కుట్టుకొని వాడుకుంటున్నాను" చెప్పాడు సన్యాసి.

"బాగుంది. కానీ , ఈ కొత్త దిండు కవరుకు ముందు- పాత దిండు కవరు ఒకటి ఖచ్చితంగా ఉండి ఉంటుంది- కదా! మరి ఆ పాత దిండు కవరును ఏం చేశావు?" అడిగాడు బుద్ధుడు.

"ఇన్నేళ్లలోనూ నా తల దాన్ని కొన్ని లక్షల సార్లు రుద్దుకొని రుద్దుకొని ఉంటుంది- అలా దానికి ఒక పెద్ద రంధ్రం పడింది. నేను ఇప్పుడు దాన్ని కాళ్ళు తుడుచుకునే పట్టా గా వాడుకుంటున్నాను" బదులిచ్చాడు సన్యాసి.

అయినా బుద్ధుడికి తృప్తి కలగలేదు. ఏ విషయాన్నైనా చాలా లోతుగా పరిశీలిస్తాడాయన- అందుకని , వెంటనే అడిగాడు-"మరి నువ్వు నీ పాత కాళ్ళు తుడుచుకునే పట్టాను ఏం చేశావు?"

"గురువుగారూ, వాడగా-వాడగా నా పాత ఫుట్ మ్యాట్ పూర్తిగా అరిగిపోయింది. దాని నిలువు పోగులు, అడ్డు పోగులు పూర్తిగా ఊడి వస్తున్నాయి. నేను ఆ నూలు పోగులను పేని, వత్తులు చేసుకున్నాను. ప్రతిరోజూ నూనె దీపంలో కి ఆ వత్తుల్నే వాడుకుంటున్నాను" అన్నాడు సన్యాసి.

బుద్ధుడు సంతోషించాడు. చిరునవ్వు నవ్వాడు. సన్యాసికి కొత్త శాలువా లభించింది.



నక్కరాజు - పందిరాజు

"కప్పరాజు-పందిరాజు" పేరిట అనంతపురం జిల్లాలో ప్రచారంలో ఉన్న ఈ జానపద కథలో భూస్వామ్య వ్యవస్థ తాలూకు భావనలు, ఆ వ్యవస్థ శ్రమజీవులనుండి ఆశించే గుణాలు స్పష్టంగా కనిపిస్తాయి. నేటి విలువలను కనబరచేటందుకు దీన్ని కొద్దిగా మార్చాం- చదవండి.



సేకరణ: పూజారప్ప ఓబిలేసు, చెన్నేకొత్తపల్లి.

ఒక అడవిలో ఒక నక్క -ఒక పంది జతగా ఉండేవి. అడవిలోని జంతువులన్నీ నక్కనూ, పందినీ తమ రాజులుగా కొలిచేవి. మామూలుగా అవి రెండూ అడవిలోనే కలిసి మేత మేస్తుండేవి. అయితే ఒకనాడు నక్కరాజు-పందిరాజు మేతను వెతుక్కుంటూ ఒక ఊరివైపుకు పోయాయి. పోయి -పోయి, అవిరెండూ ఊరి ముందర్నే ఉన్న తోటలోకి వెళ్ళాయి. అక్కడ ఆ రెండింటికీ కావలసినంత ఆహారం దొరికింది. ఆరోజు తోటలో వాటికి దొరికిన ఆ ఆహారం చాలా రుచికరంగా ఉంది; అంతేకాక అది కుప్పలు తిప్పలు గా ఉన్నది

కూడా. అటు తర్వాత నక్కరాజు-పందిరాజు ప్రతిరోజూ ఆ తోటకే వెళ్ళి కడుపునిండా మెక్కటం మొదలుపెట్టాయి. ఇలా కులాసాగా నడుచుకుంటూ తోటకు వెళ్ళడం- అక్కడ కావలసినంత మెక్కటం - ఆ పైన ఇంటికి పోయి పడుకోవటం- ఇది రోజువారీ పనయింది మిత్రులిద్దరికీ.



రోజూ అక్కడికి చేరుకొన్న వెంటనే, నక్క-పంది రెండూ తమకు దొరికిన ఆహారం మీదికి దూకేవి. అయితే నక్క త్వరగా మేసేసి, తోటనుండి బయటకు వచ్చి, గట్టిగా కూతలుపెట్టేది. పంది మాత్రం నిదానంగా, కడుపునిండా తిన్నాకగానీ అక్కడినుం డి కదిలేది కాదు. ఈ తతంగమంతా ప్రతిరోజూ నడిచేది.

ఒకనాడు నక్కపెట్టే కూతలను విన్న ఆ తోట యజమాని, అడవి జంతువుల బారి నుండి తన పంటను ఎలా కాపాడుకోవాలో ఆలోచించుకున్నాడు. మంచి వేటకుక్కలను పట్టుకొచ్చాడు. ఆ మర్నాడు నక్క కూతలు పెట్టే సమయానికి వాటిని తోటలోకి వదిలాడు. ముందుగా తినేసి తోట బయటికి వెళ్ళి కూస్తున్న నక్క, వేటకుక్కల రాకను పసిగట్టి హడావిడిగా అడవిలోకి పారిపోయింది. కానీ, ఇంకా తోటలోనే తీరికగా మేస్తున్న పంది మాత్రం ఆ వేటకుక్కలకు దొరికిపోయింది. ఆ వెంటనే తోట యజమాని వచ్చి, పందిని పట్టుకొని, చెట్టుకు కట్టేశాడు. కట్టేసి, "పందిరాజా! ఇన్నాళ్లూ నువ్వు నా తోటలో పంటనంతా తిన్నావు- అందుకుగాను నువ్వు నాకు నష్టపరిహారం తప్పక చెల్లించాలి " అన్నాడు.

"నాదగ్గరేముంది, మీకు ఇవ్వటానికి? ఏదో, ఒక సంవత్సరంపాటు మీరు చెప్పిన పని

చేసుకుంటూ ఉండిపోయి, మీ బాకీ తీర్చేస్తా" అన్నది పంది. "ఇప్పుడు దారిలోకి వచ్చింది" అనుకున్న రైతు దానికి తోటలోనే పనిపెట్టాడు. పందికూడా నోరుమూసుకొని ఆ తోటలోనే పనిచేసుకుంటూ ఉండిపోయింది.

కానీ పారిపోయిన నక్క కథ వేరుగా ఉండింది. అది ఆసరికే బాగా తినమరిగింది. తన మిత్రుడైన పంది వేటకుక్కలకు దొరికిపోయిన తర్వాత కూడా నక్క ఆ తోటకు పోకుండా ఉండలేకపోయింది. "నా అంతటిది, మామూలు వేటకుక్కలకు దొరుకుతుందా?" అనుకున్నదది. అయితే ఒకనాడు అదికూడా వేటకుక్కలకు చిక్కిపోయింది. పందితో కలిసి ఆ తోటలో పని చేయాల్సివచ్చింది.

అయితే అప్పటికే పందికి పని బాగా అలవాటయింది. అది బాగా కష్టపడి పనిచేసేది. కొత్తగా చేరిన నక్కకు పనిచేయటం వచ్చేది కాదు. అదీకాక, అంతవరకూ పనీపాటా లేకుండా తిని, తిరిగే నక్కకు పని చేయాలంటే మనసు కూడా ఒప్పేది కాదు. అందుకని అది పోయి, ఓ చెట్టుకింద పడుకొని , నిద్రపోతూ ఉండేది. అయితే రైతు తోటకువచ్చే సమయం అవుతున్నదనగా అది పంది దగ్గరకు వెళ్ళి, "యజమాని అన్నం తెచ్చే పొద్దయింది. నువ్వు పోయి కాళ్లూ చేతులు కడుక్కో" అని చెప్పేది. పంది అట్లా వెళ్ళి, తన కాళ్లూ చేతులు కడుక్కోగానే, నక్క తన ఒంటికి బురద పూసుకొనేది. యజమాని వచ్చి చూసి, "ఓహో నక్క బాగా పనిచేస్తున్నది- అందుకనే దానికి బురద అంటి ఉన్నది - పంది చూడు, ఎంత శుభ్రంగా ఉన్నదో- అది అస్సలు పనిచేస్తున్నట్లు లేదు' అనుకునేవాడు. నక్కకు బాగా ఇష్టంగా, ప్రేమగా తిండిపెట్టేవాడు.

యజమాని పోగానే, నక్క పందితో "చూశావా? రైతుకు నేనంటే ఎంత ఇష్టమో? నువ్వు కూడా నాలాగానే చెట్టు నీడన పడుకో, పని అస్సలు చేయకు. అప్పుడుగానీ రైతు నీకు కడుపునిండా తిండి పెట్టడు" అనేది.

అయితే ఒకనాడు నక్క ఖర్మ కొద్దీ యజమానికి ఏదో పనిపడి, రోజూకంటే ముందుగానే తోటకు వచ్చేశాడు. ఆ సమయానికి నక్క ఓ కొబ్బరిచెట్టు నీడన

పడుకొని ప్రశాంతంగా నిద్రపోతూ ఉన్నది. రైతు దాన్ని చూసికూడా ఏమీ అనకుండా తన పని తను చేసుకున్నాడు. అయితే ఇక యజమాని రోజూ వచ్చే సమయం అయ్యిందని అనిపించగానే నక్క కాస్తా లేచి, పందితో ఏదో మాట్లాడటం, పంది వెళ్ళి కాళ్ళూ-చేతులూ కడుక్కోవటం, నక్క పోయి తన ఒంటికి బురద పట్టించుకోవటం - అన్నీ యథా ప్రకారం జరిగాయి. దీన్నంతా గమనించిన రైతుకు రోజూ జరుగుతున్న తతంగం అర్థమయిపోయింది.

ఆపైన రైతు నక్కను పట్టుకొని, ఎండుమిరపకాయలతో పొగబెట్టాడు. నీతి -నిజాయితీలు ఏనాటికయినా గెలుస్తాయని తెలుసుకున్న నక్క, అప్పటినుండి బుద్ధిగా మసలుకున్నది! త్వరలోనే ఆ రెండూ అప్పును తీర్చేసి, అడవిని చేరుకున్నాయి.



జోకు

టీచర్ :గోపిని లేపి నువ్వుపెద్ద య్యాక ఏమవుతావురా అని అడిగింది?


గోపి: నేను డాక్టర్ అవుతాను టీచర్.

టీచర్ : రామును లేపిపెద్దయ్యాక నువ్వేమవుతావురా అని అడిగింది?

రాము: నేను ఇంజనీర్ అవుతాను టీచర్.

టీచర్ : బాలును లేపి పెద్దయ్యాక నువ్వేమవుతారా అని అడిగింది?

బాలు : నేను పెద్ద య్యాక ముసలివాన్ని అవుతాను టీచర్.



కోటిపనోడు

సేకరణ, కథనం, చిత్రాలు: ఆశన్నగారి సర్దార్ రాముడు, కొత్తముచ్చుమర్రి గ్రామం, కర్నూలు జిల్లా.

అనగా అనగా సరాపల్లె అనే మారుమూల పల్లె ఒకటి ఉండేది. ఆ పల్లెలో నులకమంచాలు అల్లే జానయ్యకు రాజా అనే కొడుకు ఉండేవాడు. రాజా తన తండ్రితోబాటు నులకమంచాలు అల్లటానికి తోడుగా వెళ్తుండేవాడు. అలా వెళ్ళినప్పుడు, తండ్రి మంచం అల్లుతుంటే వాడు మంచం కోడును ఎత్తిపట్టుకునేవాడు. అలా రాజు మంచం కోడును చకచకా ఎత్తి, కదలకుండా పట్టుకోవటంవల్ల, వాళ్ల నాన్న 'నువ్వు కోడు ఎత్తటంలో మంచి పనోనివిరా!' అని పొగిడేవాడు. అలా ఆ గ్రామంలో చాలామంది వాడిని కోటిపనోడు అని పిలవసాగారు. అందరూ అలా పిలవటం వల్ల రాజుకు కొంత గర్వం పెరిగింది. 'నా అంతటి పనోడు లేడు' అనుకునేవాడు.

తన కొడుకు గర్వాన్ని గమనించిన జానయ్య, "నాయనా రాజా! ఈ లోకంలో చాలామంది పనిమంతులు ఉన్నారు. నువ్వు లోకం తెలియక నీలో నువ్వు గర్వపడుతున్నట్లుంది. అలా కొద్దిగా బయటిదేశాలు తిరిగి వచ్చావంటే నీకంటే గొప్పవాళ్ళు కనబడతారు" అని చెప్పాడు.

దానికి రాజా "సరే, నాకంటే పనిమంతులు ఉన్నారా, వాళ్లు నిజంగా ఎంతటివాళ్ళో కనుక్కుంటాను" అని మరుసటిరోజే సద్దిమూట కట్టుకొని బయలుదేరాడు. అలా బయలుదేరిన కోటిపనోడికి కోతులమర్రి అనే గ్రామ సమీపంలో రామయ్య అనే విలుకాడు కనబడ్డాడు. తన భార్య ముగ్గు వేస్తుంటే అతను ఆమె ముక్కుపుడకలోంచి లక్ష్యానికి గురిచూసి బాణాన్ని సంధిస్తున్నాడు. కోటిపనోడు అక్కడేనిలబడి, బాణం లక్ష్యాన్ని సూటిగా ఛేదించటం చూసి, ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత వాడు రామయ్యను కలుసుకొని 'మీ అంతటివాడు లేడు' అని పొగిడి, తను వచ్చిన పని చెప్పాడు.

అప్పుడు రామయ్య "చూడు, నేనేమీ కాదు. నాకంటే ఇంకా గొప్ప నేర్పరులు ఉంటారు. కాబట్టి వాళ్ళు ఎవరో తెలుసుకోవటానికి నేనూ నీతోబాటు వస్తాను పద" అని బయలుదేరాడు.

కోటి పనోడు, రామయ్య ఇద్దరూ ఉదయాన్నే పొలాల గట్టున వనములపాడు అనే గ్రామం సమీపంలోంచి వెళ్తుండగా, ఒకతను రెండు తాటిచెట్లను రెండు చేతులతో పట్టుకొని, ఒక తాటిచెట్టుతో పళ్లు తోముకుంటూ, వీళ్లకు ఎదురయ్యాడు. వీళ్లిద్దరూ అతన్ని ఆపి తాము వచ్చిన పనిని గురించి, గొప్పవాళ్లను వెతుకున్న సంగతి గురించి అతనికి చెప్పారు.

అతను తాటి చెట్లను పక్కకు పారవేసి, తన పేరు తాటయ్య అని చెప్పి, గొప్పవాళ్లను చూసేందుకు తనూ వాళ్లతోబాటు వస్తానన్నాడు.

కోటిపనోడు, విలుకాడు, తాటయ్య ముగ్గురూ కలిసి పోతుండగా మధ్యాహ్న సమయంలో వాళ్లకొక వింతదృశ్యం కనిపించింది. కొండ ప్రాగటూరు అనే గ్రామానికి దగ్గర్లో ఒక రైతు, రెండు పులులను కాడికి

కట్టుకొని, రెండు పెద్ద నల్లత్రాచుపాములను పగ్గాలుగా చేసుకొని పొలం దున్నుతూ కనబడ్డాడు. అది చూసి వీళ్ళు ముగ్గురూ అతని దగ్గరికి వెళ్ళి, తాము వచ్చిన విషయం గురించి చెప్పారు.

"నాపేరు పులికేశవ" అని చెప్పి, అతను "నాకంటే గొప్పవాళ్లు ఈ ఊరిలోనే ఉన్నారు " అని చెప్పాడు. "ఎవరు?" అని ఉత్సాహంగా అరిచారు ఈ ముగ్గురూ. "ఇంకెవరు, నా భార్యనే- కొంచెం సేపు ఆగారంటే మీరు నాభార్యను కూడాచూసి వెళ్లచ్చు. ఇప్పుడు ఆమె నాకోసం భోజనం తీసుకొని వస్తుంటుంది" అన్నాడు పులికేశవ.

ముగ్గురూ సరేనని పులికేశవతో కలిసి చెట్టుక్రిందకు చేరుకున్నారు. ఇంతలో పులికేశవ భార్య కావేరమ్మ పది మళ్ల అన్నాన్ని నెత్తిన పెట్టుకొని, వందలీటర్ల నీళ్ళు పట్టే బుంగనొకదాన్ని నడుముమీద పెట్టుకొని వచ్చింది. ఆమె శక్తిని చూసిన మిత్రులు ముగ్గురూ బిత్తరపోయారు.

ఆమె వాళ్ళు వచ్చిన పనిని తెలుసుకొని, వాళ్లందరికీ అన్నం పెట్టి, వాళ్లతోబాటు తన భర్త పులికేశవనుకూడా గొప్పవాళ్లను చూసివచ్చేందుకు పంపింది. అలా నలుగురూ దేశాలు పట్టుకొని వెళ్తుండగా చీకటిపడింది. వీళ్లు నలుగురూ 'ఎల్లాల' అనే గ్రామంలో పడుకుందామని వెళ్ళారు. అక్కడ ఒకతను ఓ మైదానంలో నిలబడి ఎటో దీక్షగా చూస్తూ కనబడ్డాడు. అతను తనలోతాను నవ్వుకుంటుండటం చూసి- "ఇతనెవరో పిచ్చివాడిలాగా ఉన్నాడు- పాపం ఏవో కలలు కంటున్నట్లున్నాడు" అనుకున్నారు వాళ్లు ఎగతాళిగా.

అతను వాళ్ల మాటలు విని, "ఏంటయ్యా, నా గురించి తెలిసే మాట్లాడుతున్నారా, బహుశ: మీరు కంటిచూరయ్య గురించి విన్నట్లు లేదు. కంటి చూరయ్య ఎవరోకాదు, నేనే. నేనిప్పుడు పదివేలమైళ్ల దూరంలో జరుగుతున్న తోలుబొమ్మలాటను చూస్తున్నాను. ఎంతదూరంలో ఉన్న వస్తువునైనా చూడగల సత్తానాలో ఉన్నది" అన్నాడు.

వాళ్లు నలుగురూ అతన్ని క్షమించమని

అడిగి, తాము వచ్చిన పని గురించి చెప్పారు. కంటిచూరయ్య కూడ వాళ్ళతో కలిసి మరుసటిరోజు బయలుదేరాడు, గొప్పవాళ్లని చూసేందుకు.

వాళ్ళు ఐదుగురూ నడిచిపోతుంటే ఒకతను వీళ్లను దాటుకొని వేగంగా ముందుకు నడుస్తూ పోయాడు. అతను తలపైకెత్తి, సూర్యుడివైపు చూస్తూ ఎంతో వేగంగా నడుస్తున్నాడు. వీళ్ళు అతని వెంట పరుగుతీస్తూ "ఏమైంది అన్నా, ఎందుకు, అంత వేగంగా పోతున్నావు, తలపైకెత్తి సూర్యుడిని చూస్తూ పోతున్నావు ఎందుకు?" అని అడిగారు. దానికి అతను "నాపేరు "సూరయ్య". నేను రోజూ ఉదయించే సూర్యుని దగ్గరనుండి నడక మొదలుపెట్టి సాయంత్రంలోగా అస్తమించే సూర్యుడిని కలుసుకుంటుంటాను. అంతవేగంగా నడవగల శక్తిని ఆ దేవుడు నాకిచ్చాడు" అన్నాడు. వాళ్ళు అతన్ని మెచ్చుకొని, తాము వచ్చినపని గురించి చెప్పారు.

ఆ సంగతీ ఈ సంగతీ మాట్లాడుకుంటూ వాళ్ళు నడుస్తుంటే సూరయ్య దారిలో తను విన్న సంగతినొకదాన్ని చెప్పాడు- "లంకాపురి అనే రాజ్యపు రాకుమార్తెను ఒక రాక్షసుడు ఎత్తుకుపోయాడు. ఆ రాకుమారిని ఎవరైతే క్షేమంగా తీసుకొనివస్తారో అతనికి తన రాజ్యం ఇవ్వటంతోబాటు ఆమెను ఇచ్చి వివాహం చేస్తానని రాజుగారు దండోరా వేయించారు" అని.

కోటిపనోడు అన్నాడు- "మనందరం గొప్పవాళ్లను కలిస్తే బాగుండు అనుకుంటున్నాం- సరే. కానీ మన పరిధిలో మనం- ఈ రాకుమార్తెను కాపాడితే బాగుంటుంది కదా" అని. అందరూ సరేనని, తమ తమ శక్తి కొద్దీ తలొక పనీ చేయటం మొదలుపెట్టారు.


సూరయ్య వేగంగా నడిచి రాకుమారి ఎక్కడుందో కనుక్కున్నాడు. అతన్ని గమనిస్తూ పోయిన కంటిచూపయ్య మిగిలిన వాళ్లకు ఆ వివరాలు తెలియపరచాడు. ఆ రాక్షసుని స్థావరం ఎత్తుమీద ఉండటం వల్ల, అక్కడికి తాటయ్య, పులికేశవ వెళ్ళారు.

తాటయ్య పులికేశవను పైకి ఎత్తి ఆ రాక్షసుడి కోటలోకి పంపాడు. అతని అనుచరులను హతమార్చిన పులికేశవ, కోట తలుపులు తెరిచిపెట్టాడు. ఆదారిన మిగిలినవాళ్లంతా కోటలోపలికి చేరుకున్నారు.

కోటిపనోడు విలుకాడిని ఎత్తిపట్టుకున్నాడు. అప్పుడు విలుకాడు కంటి చూపయ్య వూపించిన వైపుగా బాణం వేసి, ఒక్క బాణంతోటే రాక్షసుడిని అంతమొందించాడు.

ఆ విధంగా ఆ ఆరుగురూ రాకుమార్తెను రక్షించి, రాజుగారికి అప్పగించారు. కానీ రాజుకు ఓ సమస్య వచ్చిపడింది. తన మాటప్రకారం ఈ ఆరుగురికీ రాజ్యాన్నైతే పంచెయ్యగలడు- కానీ తన కూతుర్ని ఎవరికిచ్చి పెళ్ళి చేయాలి? ఆరుగురూ ఎవరికి వాళ్ళే తమ గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. ఎవరికి వాళ్ళే రాకుమార్తె తమకు దక్కాలంటున్నారు!

రాజుగారు, మంత్రిగారూ తీవ్రంగా ఆలోచించి, ఈ సమస్యను పరిష్కరించే బాధ్యతను రాకుమారికే అప్పజెప్పారు. ఆమె, ఒక్క క్షణం ఆలోచించి, కోటిపనోడిని వరించింది!



సభలోవాళ్లెవరికీ ఆమె ఇలా ఎందుకు నిర్ణయించుకున్నదీ అర్థం కాలేదు. అందరూ కారణం అడిగితే, ఆమె అన్నది: " 'ఎవరు ఎంత బలవంతులు' అన్నది ముఖ్యంకాదు- ఎవరెంత సాధన చేశారన్నదే ముఖ్యం. గొప్పవాళ్లు అందరినీ కలుసుకోవాలన్న కోరికతో మొదలెట్టి, అందరినీ ఒకచోట చేర్చి, అందరూ కలిసి పనిచేసేందుకు, సమాజ శ్రేయస్సుకు నడుం బిగించేందుకు దోహదం చేసిన 'కోటిపనోడు" గొప్పవాడు. అందుకని అతన్ని వరించాను" అని. సభికులందరూ హర్షధ్వానాలతో ఆమె నిర్ణయాన్ని అభినందించారు.



మురికి దయ్యం

సరదా కథ

రచన: ఆర్.రాజకుమార్, కొత్తపల్లి బృందం.



రామాపురం గ్రామంలో రామయ్య, కమలమ్మ అనే దంపతులు ఉండేవాళ్ళు. ఉద్యోగరీత్యా రామయ్య తన భార్యతో సహా భీమవరం అనే గ్రామానికి వెళ్ళాడు. అయితే ఆ గ్రామంలో రామయ్యకు ఎంత వెతికినా ఒక్క ఇల్లు కూడా అద్దెకు దొరకలేదు. చివరికి ఊరి చివర్లో ఒక పాడుబడిన ఇల్లు ఖాళీగా కనబడింది. ఊళ్ళో ఆ యింటి యజమాని గురించి వాకబు చేసాడు రామయ్య.

ఇంటి యజమాని ఎవరో దానయ్య అట. అతను చనిపోయి పదేళ్లయినా తన ఇంటిమీద మమకారం చావక, ఇంకా ఆ ఇంటినే అంటిపెట్టుకొని ఉన్నాడట. ఊళ్ళోవాళ్ళెవ్వరూ అటువైపుకు రారు. ఆ ఇంట్లో ఉండే ఆలోచన మానుకొమ్మని రామయ్యకు, కమలమ్మకు సలహా ఇచ్చారు వాళ్ళు.

అయినా వేరే అవకాశం లేని రామయ్య, ఆ ఇంటికే వెళ్తానన్నాడు. "సరే, మీ ఇష్టం; మేం చెప్పాల్సింది చెప్పాం" అన్నారు ఊళ్ళో జనాలు.

అయితే ఇల్లు చాలా అపరిశుభ్రంగా ఉన్నది! కమలమ్మ, రామయ్య చీపురు కట్టలూ, బూజు కట్టెలూ చేతబట్టుకొని ఆ యింట్లోకి ప్రవేశించారు. వాళ్ళు ఇంట్లో అడుగు పెట్టారో, లేదో, దానయ్య దయ్యం వాళ్లముందు ప్రత్యక్షమైంది "ఊ....." అంటూ. ఇద్దరూ చటుక్కున ఆగిపోగానే అది వాళ్ల చుట్టూ గింగిరాలు కొడుతూ "ఎవరు మీరు? ఎందుకొచ్చారు, నా యింటికి? ఇక్కడికి చీపురు కట్టలు, బూజు కట్టెలూ తేకూడదని మీకు తెలీదా?" అని అరిచింది బిగ్గరగా.

రామయ్యకు గుండె ఆగినంత పనైంది. దెయ్యం గియ్యం అని ఊరికే కట్టుకథలు చెప్పారనుకున్నాడు గానీ, అది ఇలా కళ్ళముందు గింగిరాలు తిరుగుతుందని అతను అనుకోలేదు మరి! కానీ కమలమ్మ మొండిది. ఆమె "మాకు ఉండేందుకు వేరే ఇల్లు ఎక్కడా లేదు. ఈ ఇల్లు తప్ప మాకు వేరే గతి లేదు. మేం ఇక్కడ ఉండాల్సిందే. నీకు ఇష్టమైనా అంతే; కష్టమైనా అంతే" అన్నది మొండిగా.

దయ్యం ఇప్పటివరకూ అలాంటి సమాధానం విని ఎరగదు. ఎవరొచ్చినా దాని అరుపు వినగానే పారిపోయేవాళ్ళు. కమలమ్మ మొండితనం దానికి నచ్చింది. అయితే ఇన్నేళ్ళుగా అది ఒంటరి జీవితానికి అలవాటు పడి ఉన్నది. ఇప్పుడు ఎవరితోటో తన ఇంటిని పంచుకోవాలంటే దానికి కష్టమే అనిపించింది. అయినా కమలమ్మ వినేటట్టు లేదు. అందుకని అది "ఇదిగో, ఇక్కడ నేను తప్ప, మనిషన్నవాడు ఉండే అవకాశం లేదు. ఒక వేళ ధైర్యం చేసి మీరిద్దరూ ఇక్కడ ఉంటామంటే- సరే; కానీ నేను పెట్టే ఐదు షరతులకూ లోబడాలి మరి" అన్నది తెలివిని ప్రదర్శిస్తూ.

"ఏమిటా షరతులు, నన్నూ విననివ్వు!" అన్నది కమలమ్మ.

"ఈ ఇంట్లో చెత్తను ఊడవకూడదు. బూజు దులపకూడదు. మీరెవ్వరూ స్నానం

చెయ్యకూడదు. గిన్నెలు తోమకూడదు- ఇవి కాక, నాకోసం రోజూ చేపలు వండిపెట్టాలి" అన్నది దానయ్య దయ్యం, ఇకిలిస్తూ. మనిషన్నవాడెవ్వడూ ఈ షరతులకు ఒప్పుకోడని దానికి తెలుసు.

కానీ కమలమ్మకు ఈ షరతులేవీ బరువనిపించలేదు. "ఓస్! ఇంతేనా? నువ్వు నాకు నచ్చావు. షరతులంటే మరేవో అనుకున్నాను. ఇవేనా! చెత్తను ఊడవకపోతే, బూజు దులపకపోతే, నాకు శ్రమ ఉండదు. వంటగిన్నెలు కడుక్కోకపోతే నాకు ఎంత పని తగ్గుతుంది! స్నానం చెయ్యకపోతే అసలే పని ఉండదు. నువ్వెంత మంచివాడివో ఊహించుకుంటేనే నాకు సంతోషం కలుగుతున్నది. చేపల కూర నాకూ ఇష్టమే!" అన్నది కమలమ్మ, మురిసిపోతున్నట్లు.

మరునాడు తెల్లవారగానే కమలమ్మ, రామయ్య బయలుదేరి ఊరి చెరువుకు పోయి శుభ్రంగా స్నానం చేశారు. తర్వాత అక్కడ రెండు పెద్ద కొడదల్ని పట్టుకొని ఇల్లు చేరుకున్నారు. లోపలికి అడుగు పెట్టగానే దానయ్య దయ్యం ఎదురై, "నా మాట ఎందుకు కాదన్నారు" అని పళ్ళు కొరికింది.

"మేమేం చేశాం?" అన్నారు వీళ్ళిద్దరూ.

"ఇంకా ఏమనాలి? స్నానం చేసి వచ్చారు కద!" అన్నది దయ్యం కోపంగా.

"అయ్యో! ఏం చెప్పాలి? ఈ చేపల్ని పట్టుకునేందుకు మేం చెరువులోకి దిగాల్సి వచ్చింది. చలికి చచ్చాం అనుకో. అయినా నీ చేపలు నువ్వు తెచ్చిస్తే, మాకు ఈ స్నానం చేసే ఖర్మ తప్పుతుంది గద!" అన్నది కమలమ్మ.

"నేను తెచ్చిస్తానని చెప్పలేదు ముందు" అన్నది దయ్యం కొంచెం తగ్గి.

"అలాగయితే నోరు మూసుకో. మేంఇంత కష్టపడి చేపలు తెస్తే ఇలా తప్పుపట్టటం తగదు" అన్నది కమలమ్మ గడుసుగా.

ఆరోజునుండి దయ్యం ఇక వాళ్ల స్నానానికి అడ్డు చెప్పలేదు.

కమలమ్మ ఆరోజు చేపల కూరను వండుతూ, కావాలని అక్కడున్న బూజును, సాలీళ్లను అందులోకి వేసింది. చేపలకూర వాసనకు ఆగలేని దానయ్య దయ్యం

సంతోషంతో గంతులు వేసింది. అయితే కూర పూర్తై అది తినేందుకు కూర్చోగానే చేపలకు బదులు, సాలీళ్ళు, బూజు దాని కంటపడ్డాయి. అది కోపంతో "సాలీళ్లకూర కాదు, నేనడిగింది చేపల కూర!" అని అరిచింది బిగ్గరగా.

చుట్టూ బూజు ఉంటే కూరలోకి అవికాక మరేమి వస్తాయి? అయినా దయ్యాలను సాలీళ్ళు ఏమీ చెయ్యవులే" అన్నది కమలమ్మ తాపీగా.

అయినా దయ్యానికి కూర నచ్చలేదు. "ఈసారి వంటలో చెబుతున్నాను- సాలీళ్ళు ఒక్కటీ రాకూడదు" అన్నదది. "మరైతే నువ్వు కొంచెం సేపు చెరువు గట్టున తిరిగిరా, ఆలోగా నేను బూజు దులిపేస్తాను. అయినా నాకు ఇదేం పని పెడుతున్నావు అనవసరంగా" అని విసుక్కున్నది కమలమ్మ.

ఇక బూజు దులిపేందుకు దయ్యం అడ్డు తొలిగిపోయింది కనుక కమలమ్మ కులాసాగా ఇల్లును శుభ్రం చేసేసింది. అయితే దులిపిన దుమ్మును, చెత్తను బయటికి చిమ్మే వీలు లేకపోయింది- ఊడవటానికి లేదు గద!

ఇక ఆరోజు పాత్రలు అలాగే ఉండిపోయాయి కడగకుండా. కమలమ్మ ఆ పాత్రల్లో కొంచెం తేమ, దుమ్ము, చెత్త అన్నీ వేసి మురిగిపోయేట్లు చేసింది. అవి ఘోరమైన వాసన వస్తుంటే, వాటిలోనే మరునాటి రోజు చేపల కూర వండి పెట్టింది దయ్యానికి.

ఆ కూర తిన్న దయ్యానికి వాంతులు, బేదులు మొదలయ్యాయి. సాయంత్రానికి దానికి జ్వరం వచ్చేసింది. "ఏం కూర వండావు తల్లీ! నేను బ్రతికున్నప్పుడు కూడా ఇంత చల్లగా లేదు" అన్నదది వణుక్కుంటూ.

"నేనేం చేసేది? గిన్నెలు తోమకపోతే వాటికి పట్టిన బూజు, నిన్నటి చేపలు కుళ్ళి వాసన వేస్తున్నా దాన్ని చిమ్మక పోవటం వల్ల తయారైన క్రిములూ, దోమలూ అన్నీ కలిసి నీకు ఆ రోగం వచ్చి ఉండాలి. ఆచార్లు దగ్గరకు పోయి ఏమైనా మందు తెచ్చుకోరాదూ? గిన్నెలు తోమటం, ఇల్లు ఊడ్చటం నావల్ల కాదు బాబూ" అన్నది కమలమ్మ ఆవులిస్తూ.

"కాదు కాదు. ఈ చెత్తను ఊడ్చి పారెయ్యి. గిన్నెలు శుభ్రంగా తోము. ఏమీ అనుకోకు.

నేను ఈ వణుకును తట్టుకోలేకపోతున్నాను" అన్నది దయ్యం ప్రాధేయపడుతున్నట్లు.

"సరేలే, మీ ఇంట్లో ఉండి నువ్వు చెప్పినట్లు చేయకపోతే కుదురుతుందా?" అని గొణుక్కుంటూ కమలమ్మ ఇల్లును ఊడ్చి శుభ్రం చేసి, గిన్నెలు కడిగిపెట్టుకున్నది.

ఇంకో రెండు రోజులు గడిచేసరికి, దయ్యం రోగం కుదురుకున్నది. ఇప్పుడు అది కమలమ్మ మాట విని రోజూ ఉదయం, సాయంత్రం ఆరు బయట చల్లగాలిలో తిరిగి వస్తున్నది. రోజూ ఒక గంట ధ్యానంకూడా చేస్తున్నది. రాను రాను దానికి పరిశుభ్రంగా ఉండటం మంచిదే అని అనిపించసాగింది. ధ్యానం వల్ల దాని కోపం కూడా తగ్గింది. పరలోక చింతన పెరిగింది కూడాను. అంతేకాదు- దానికి కమలమ్మ మీద ఎంత గురి కుదిరిందంటే, ఆమె చేతిలో తన ఇల్లు అద్దంలా మెరిసిపోతూ భద్రంగా ఉంటుందని దానికి నమ్మకం కలిగింది. కొన్నాళ్లకు దానికి ఆ ఇంటి పైన మమకారం నశించింది. చివరికి అది ఇంటిని కమలమ్మకు, రామయ్యకు అప్పగించి తపస్సుకోసం నిశ్చింతగా అడవులకు వెళ్లిపోయింది.



పొడుపు కథలు

18. గుంపు గుంపు చెట్లలో ఎర్ర పిల్ల ఏంటది?

19. ఎక్కలేని చెట్లకి లెక్కలేనన్ని కాయలు ఏంటది?

20. పొద్దున్నే నాలుగు కాళ్ళతో నడిచేది, మధ్యాహ్నం రెండు కాళ్ళతో నడిచేది, సాయంత్రం మూడు కాళ్ళతో నడుస్తుంది. అది ఎవరు?

సమాధానాలు 55 పేజీలో.



రాక్షసి పిల్ల కథ



రచన: నారాయణ, కొత్తపల్లి బృందం

వింధ్య పర్వతాల్లో ఒక దట్టమైన అడవి ఉండేది. కాకులు దూరని ఆ అడవిలో అనేక జంతువులు, పక్షులు తరతరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకొని ఉండేవి. ఆ ఆడవిమధ్యలో ఒక సరస్సు ఉండేది. ఆ సరస్సుకు దగ్గరగా ఉన్న గుహలో ఒక రాక్షసి, తన పిల్లతో సహా నివసించేది. ఈ రెండూ చాలా మంచివి. ఏనాడూ ఒక్క ప్రాణికి కూడా అపకారం చేసి ఎరుగవు. మిగిలిన జంతువుల లాగే, వాటిమానాన అవి జీవిస్తూ ఉండేవి. పిల్ల రాక్షసికి తను పుట్టిన ఆ అడవి అన్నా, అక్కడి వాతావరణం అన్నా చాలా ఇష్టం. అమ్మ రాక్షసికి తన పిల్ల అంటే ప్రాణం.

ఒకసారి పిల్ల రాక్షసి సరస్సు ఒడ్డున కూర్చొని, కాళ్ళు నీళ్ళలోకి చాపుకొని ఆడుకుంటున్నది, రోజూలాగే. చుట్టూ వాతావరణం బాగున్నది-

వసంతం వచ్చింది. పూలు వికసించి, గాలికి ఊగుతున్నై. పక్షులు కువకువలాడుతున్నై. ప్రకృతి సోయగాలను చూస్తూన్న పిల్లరాక్షసి మైమరచి పోతున్నది.

అకస్మాత్తుగా తన మీద ఏదో నీడ పడినట్లై, వెనక్కి తిరిగి చూసింది అది- అక్కడో వింత ప్రాణి నిలబడి ఉన్నది, తనకేసే చూస్తూ. రెండు కాళ్ళు- రెండు కాళ్లమీద నిలబడి ఉన్నదది, అచ్చం రాక్షసుల లాగే. కానీ దాని తలమీద కొమ్ములు లేవు- ఏదో కప్పుకొని ఉన్నది. కోరలు లేవు- నోటి లోపలికే పోయినట్లున్నై, మరి. రంగులు రంగులుగా ఉంది, దాని చర్మం- వెంట్రుకలూ లేవు, పొలుసులూ లేవు! చేతిలో పొడుగాటి కట్టె పట్టుకొని, అది క్రూరంగా చూస్తున్నది తనవైపే.

పిల్ల రాక్షసికి భయం వేసింది. గబుక్కున లేచి నిలబడి దానివైపే చూస్తూ కదలకుండా ఉండిపోయింది ఒక్క క్షణం. ఆ సమయంలో వింత ప్రాణి "హే..య్" అని అరిచింది. వెంటనే దాని దగ్గరున్న కట్టెలోంచి "టు..శ్..శ్..ష్" అని శబ్దం చేస్తూ ఏదో దూసుకొచ్చింది రాక్షసి పిల్ల మీదికి. రాక్షసి పిల్ల ఒక్క ఉదుటున ప్రక్కకు దూకి, ఎటు పడితే అటు పరుగు తీసింది.

వింతజీవి దాని వెంట పడింది, అరుచుకుంటూ. దాని చేతిలో ఉన్న కట్టె ఆగి ఆగి "టు..శ్..శ్..ష్" అని శబ్దం చేస్తున్నది. రాక్షసి పిల్ల ఇక వెనక్కి తిరిగి చూడకుండా పరుగు తీసింది, వింతజీవికి అందకుండా పొదలలోకీ, తుప్పలలోకీ పరుగెత్తిపోయింది.

అలా పరుగెత్తుతుంటే దానికి ఏనుగు ఎదురైంది. "కాపాడు, కాపాడు. ఏదో వింతజీవి, రెండు కాళ్లమీద వెంటపడుతోంది. "టుష్.." మని శబ్దం చేస్తోంది" అన్నది పిల్లరాక్షసి, వగరుస్తూ. అంతలో "ఏ...య్! ఎక్కడున్నావు నువ్వు? నానుండి తప్పించుకు పోలేవు! టుశ్....ష్" అని శబ్దం వచ్చింది వెనకవైపునుండి. "అమ్మో, మనిషి!" అని అంతలావు ఏనుగూ పరుగులు పెట్టి, ఒక్క క్షణంలో కనుమరుగైంది. పిల్ల రాక్షసి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసే సరికి వింతజీవి దగ్గరకొచ్చేసింది! పిల్ల రాక్షసి పరుగు మళ్ళీ మొదలైంది.

చాలా దూరం పరుగెత్తాక దానికి ప్రాణాలు కడబట్టినట్లై, ఒక ప్రక్కగా ఆగింది. అక్కడ ఓ చెట్టుమీద ఒక చిరుతపులి కునుకు తీస్తున్నది. పిల్లరాక్షసిని అది ఆప్యాయంగా పలకరించింది. "ఏదో వింత జీవి- మనిషట, నావెంట పడింది. కాపాడు, కాపాడు" అని పిల్లరాక్షసి అనగానే అది దబ్బున నేలమీద పడింది-"అమ్మో, మనిషా!?" అని అరిచి, వంకరదారుల వెంట, తుప్పల మీదినుండి దూకుతూ పరుగు పెట్టింది.

రాక్షసిపిల్లకు ఆయాసంతోటీ, భయంతోటీ ఊపిరాడనట్లౌతున్నది. అయినా ఆగేందుకు లేదు- ఏనుగునూ, చిరుతపులినీ భయపెట్టిన ఆ ప్రాణి సామాన్యమైనది కాదు! దాని పాలబడితే తన గతి ఏమౌతుందో- ఊహించుకుంటేనే దానికి వణుకు పుట్టింది.

అలా అది సింహాన్నీ, పెద్దపులినీ, తోడేళ్లనీ, నక్కల్నీ కల్సి "కాపాడమని" మొర- పెట్టుకున్నది. ఏ జంతువుల్ని కలిస్తే అవల్లా- "మనిషా!" అని ప్రాణం పోయినట్లుగా అరిచేవి; లేచి, ఒక్క ఉదుటున పారిపోయేవి!

అలా పరుగు తీసీ పరుగు తీసీ చివరికి పిల్ల రాక్షసి తమ గుహనే చేరుకున్నది. గుహలో తల్లి రాక్షసి గురక పెట్టి నిద్రపోతున్నది. పిల్లరాక్షసి వెళ్ళి "ఓయమ్మో, కాపాడు, కాపాడు" అని మొత్తుకోగానే అది లేచి, "ఏమైందే" అని అడిగింది, బద్ధకంగా. "ఎవరో మనిషట, నా వెంట పడ్డాడు. "ఏ..య్.టు..శ్..శ్..ష్" అని అరుస్తున్నాడు. అన్నది రాక్షసిపిల్ల.

తల్లి రాక్షసి ఆవులించింది. "మనిషి మనకు భయపడాలి గాని, మనం వాడికి భయపడేదేంటి?" అన్నది ఒకింత చికాకుగా. "అందరికీ అదంటే భయమేనే, నా వాసన పట్టినట్లుంది, నా వెంటే వస్తున్నది, వెతుక్కుంటూ" అన్నది పిల్ల రాక్షసి, తల్లిని కావలించుకుంటూ. "ఏం పర్లేదులే, నేను వస్తాను గదా, పద!" అని, తల్లి రాక్షసి దాన్ని బుజ్జగించి బయటికి తీసుకెళ్ళింది.

ఇవి వెళ్ళే సరికి, మనిషి అక్కడ సరస్సు దగ్గర నిల్చొని 'ఏ జంతువును చంపుకెళ్దామా' అని ఎదురుచూస్తున్నాడు.

తల్లి రాక్షసి వాడిని చూసీ చూడగానే

పెడబొబ్బలు పెట్టుకుంటూ ఒక్క ఉదుటున వాడి పైకి దూకింది. ఆ పొలికేకకు వాడికి వెన్నులోంచి చలి పుట్టుకొచ్చినట్లైంది. ఇప్పుడిక పారిపోవటం వాడి పనైంది. వాడు ముందు పరుగెత్తుతుంటే, తల్లి రాక్షసి, పిల్లరాక్షసి వాడి వెంటపడి తరిమి, తరమటంలోని ఆనందాన్ని చవిచూశాయి!

ఆ తరువాత తల్లి రాక్షసి పిల్లకు-"చూడమ్మా, మనం దేనికీ భయపడకూడదు- భయపడితే అలుసైపోతాం. ఆ తర్వాత లోకం మనల్ని వశం చేసుకుంటుంది. అందుకని, అవసరాన్ని బట్టి లోకాన్ని భయపెట్టాలి తప్ప, మనం మాత్రం ఎప్పుడూ భయపడరాదు" అని ఉపదేశించింది.




పొడుపు కథలు

21. ఒక చిన్న కుండలో ఊరంతటకి అవుతుంది. ఏంటది?

22. గుంపు గుంపు చెట్లలో ఒక చిన్న దారి ఏంటది?

23. ఒక అడవిలో జంతువులు. మరి కొంచెం ముందుకు వస్తే రెండు లైట్లు. యింకొంచెం ముందుకు వస్తే రెండు గుంతలు. యింకొంచెం కిందికి వస్తేఒక బావి అందులోఒకే ఒక ఒంటరి చేప.

సమాధానాలు 55 పేజీలో.



మనోశక్తి

మూలం: పర్తాప్ అగర్వాల్

తెలుగు అనుసరణ: నారాయణ.

అనగా అనగా పంజాబ్ ప్రాంతాన్ని బల్వంత్ సింగ్ అనే మహారాజు పరిపాలించేవాడు. ఆయనకి జంతువుల్ని పెంచటం అంటే చాలా ఇష్టం ఉండేది. ఆయన పెంపకంలో అందమైన గుర్రాలు లెక్కలేనన్ని ఉండేవి. వాటిలో కొన్ని అతి వేగంగాపరుగులు తీసేవి. కొన్ని సాటిలేని యుద్ధాశ్వాలు- ఇవేకాక రాజుగారి దగ్గర పెద్ద పెద్ద ఏనుగుల మందలు ఉండేవి-వందలాది మంది మావటీలు వాటికి శిక్షణనిస్తుండేవాళ్ళు.

ఆ ఏనుగుల్లో ప్రత్యేకమైన ఏనుగొకటి ఉండేది.బలంలో గాని,బద్దూ పొడవుల్లో గానీ దానికి సాటివచ్చే ఏనుగు మరొకటి లేదు. ఐరావతం లాంటి ఆ ఏనుగు పేరు భీముడు.

రాజుగారికి భీముడంటే విపరీతమైన అభిమానం ఉండేది. దాన్ని బలంగాను, సంతోషంగాను ఉంచేందుకు ఎంతైనా సరే,

వెచ్చించేందుకు ఆయన వెనుకాడేవాడు కాదు.

మొదట్లో భీముడు అడవిలో స్వేచ్ఛగా తిరుగుతుండేది. పట్టుబడిన కొత్తల్లో అది చాలాసార్లు తప్పించుకొనే ప్రయత్నం చేసింది- కొన్ని సార్లు నిజంగానే తప్పించుకుపోయింది కూడా. కానీ రాజుగారు తన మనుష్యుల్ని పంపి, ప్రతిసారీ దాన్ని తిరిగి బంధిస్తూ వచ్చారు. మెల్లగా భీముడు కూడా మనుషుల మాదిరే, ధనికస్వామ్యపు బీద జీవితంలో రుచులు వెతుక్కునే పట్టణ వాసానికి అలవాటు పడిపోయింది. అరణ్యపు స్వేచ్ఛ జీవితంలోని సుఖం మెల్లగా మరుగు పడింది.రాజుగారి మనుషులు చూపించే తాయిలాలు దానికి నచ్చసాగాయి.

పండుగ రోజుల్లో దానికోసమే ప్రత్యేకంగా తయారుచేయించిన ఆభరణాలతో దాన్ని అలకరించేవాళ్ళు. రాజుగారు, మంత్రిగారు భీముడి మీద కూర్చుని, ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా వెళ్తుంటే, మిగిలిన ఏనుగులన్నీ వెంటనడిచేవి. వాళ్ల ముందు సంగీత వాయిద్యాలను పట్టుకొని, వాద్యకారుల బృందం ఒకటి నడిచేది.

సైనికుల పాటల్ని ఆలపిస్తూ, ఆ సంగీతం భీముడి చెవులకు చాలా ఇంపుగా అనిపించేది. నిజానికి ఆ పాటల్ని వింటూ అది మంత్రముగ్ధం అయిపోయేది.

ఒకరోజున మావటీలు దాన్ని స్నానానికి ఊరి బయట ఉన్న చెరువుకు తీసుకెళ్ళారు. భీముడు ఆ చెరువులో పడి సంతోషంగా ఈదులాడింది. అలా ఈదుతూ, అకస్మాత్తుగా అది అక్కడే ఉన్న బురదలో కూరుకుపోయింది. ఇక అది తన బలం మొత్తాన్నీ ఉపయోగించి, ఆ ఊబిలోంచి బయట పడేందుకు పెనుగులాడింది- కానీ ఎంత పెనుగులాడితే అంత లోపలికి కూరుకుపోయింది తప్ప, అది ఇక బయటికి రాలేకపోయింది. కబురు రాజుగారికి చేరింది. ఆయన భీముడిని బయటికి లాగేందుకు చేతనైన ప్రయత్నాలన్నీ చేయమని ఆదేశించారు. ఎవరేమి చేసినా ప్రయోజనం లేదు- భీముడు కొద్దికొద్దిగా దిగబడిపోసాగాడు.

అందరూ నిరాశ పడుతున్న ఆ తరుణంలో

మంత్రి కుమారుడికి ఒక ఆలోచన వచ్చింది. ఆస్థాన వాద్యబృందాన్ని రప్పించి, భీముడికి ఇష్టమైన పాటల్ని వినిపించమన్నాడు. సంగీతం ఆ ఏనుగులో నిద్రాణమై ఉన్న శక్తుల్ని వేటినో మేలుకొలిపింది. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అది శరీరాన్ని పట్టి బధించిన బురదను దులుపుకున్నది. తనలోని శక్తినంతటినీ కూడగట్టుకొని, అది కొంచెం కొంచెంగా జరుగుతూ, ఊబిలోంచి బయట పడింది. చుట్టూ ఉన్నవాళ్ళు హర్షాతిరేకంతో చప్పట్లు కొట్టారు.

అందరూ ఒక కొత్త సంగతిని తెలుసుకున్నారు- మనసులో మనకెవ్వరికీ తెలియని శక్తులు చాలా ఉన్నాయి. శరీరం ఒంటరిగా చేయలేని పనుల్ని కూడా, మనసు తోడైనప్పుడు అది అతి సులభంగా చేసేస్తుంది. జీవితం చరమ దశలోనైనా సరే, మనం ఏది కోరుకుంటే అది సాధించగలం- మనసుపెట్టి పనిచేయాలి- అంతే.



పొడుపు కథలకు సమాధానాలు

1. గాలి	11. నీళ్ళు	21. కుంకుమ
2. గరిటె	12. చాప	22. పాపిటి
3. త్రాసు	13. మంచం	23.తల
4. తమలపాకు	14. మర్రిచెట్టు	
5. తాళంచెవి	15. ఉల్లిపాయ	
6. గుడ్డు	16. వల	
7. పుచ్చకాయ	17. చైనానే దూరం .ఎందుకంటే, చందమామ కనిపిస్తుంది,చైనా కనపడదు కాబట్టి.	
8. సీతాఫలం	18. పండు మిరపకాయ	
9.టెంకాయ నీళ్ళు	19. మిరప చెట్టు	
10.మేఘం	20. మనిషి	

చిట్టి పాటలు

బాధ

గానం: కిరణ్ కుమార్, 6 వ తరగతి, విజ్ఞాం స్కూల్, గుడిపాల, చిత్తూరు జిల్లా.

ఎ బి సి డి ఎలుకల బాధ

ఇంటికి పోతే పెళ్ళాం బాధ

చేనుకు పోతే చెప్పుల బాధ

ఇంటికి వస్తే ఇడ్లీల బాధ

ఇస్కూలుకు పోతే అయ్యవారి బాధ

బజారుకు పోతే అప్పుల బాధ!



భారతీయ వీరులం

గానం: చిత్రలేఖ, కీర్తన, తేజ, విజ్ఞాం స్కూల్, గుడిపాల.

భారతీయ వీరులం

భరతమాత బిడ్డలం

మాతృదేశ గౌరవం

కాపాడే వీరులం

శాంతికోరు పాపలం

సమత పెంచు బాలలం

మేం భావి పౌరులం

త్యాగధనుల వారసులం

వేషభాషలేవైనా
మనం భారతీయులం
మనం భారతీయులం
ఒకే తల్లి పిల్లలం
???దేశం
ప్రతిభను నిలబెడదాం
ప్రతిభను నిలబెడదాం

గుడ్ మార్నింగ్

గానం: సంతోష్, 5 వ తరగతి

గుడ్ మార్నింగ్ సార్
గుండెనొప్పిసార్,
రెండు సార్,
రొమ్మునొప్పిసార్,
మూడు సార్,
ముక్కునొప్పిసార్,
నాలుగు సార్,
నడుం నొప్పి సార్,

వాషింగ్ పౌడర్

వాషింగ్ పౌడర్ నిర్మా
అమ్మ చేతి కుర్మా
తినకపోతే నీ ఖర్మ




కూడిక మెట్లు

నిర్వహణ: ఆనంద్, కొత్తపల్లి బృందం.


క్రింది వాటిలో ఖాళీ గళ్ళను సరైన అంకెలతో నింపండి.


ప్రతి గడిలోని సంఖ్య, దానిక్రింద ఉండే రెండు గళ్ళలోని సంఖ్యల మొత్తం అవ్వాలి.


ఒక ఉదాహరణ చూడండి:





ఇక మీరు చెయ్యండి!








64
15
26
10
7


89
40
8
9
7


106
48
31
15
6


60
7
11
4
8

ఇదిగో, చాలా పెద్దది ఒకటి:



కొత్తపల్లి బృందం

చందా వివరాలు

సంవత్సర చందా: 200/ రూ.

చందాను 'కొత్తపల్లిట్రస్టు' పేరిట మనీఆర్డర్ లేదా డి.డి లేదా చెక్కు రూపంలో కట్టవచ్చును. డి.డి., చెక్కులకు బ్యాంకు చార్జీలు (25రూ) కలపాలని మనవి.

చందాలకై చిరునామా:

కొత్తపల్లి ట్రస్టు,
2-312, న్యామద్దల రోడ్డు, చెన్నేకొత్తపల్లి,
అనంతపురంజిల్లా, 515101.

బ్యాంకు ద్వారా చందా కట్టడానికి వివరాలు:

సి.ఎచ్. రాము, A/c No:62079470871,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, శాంతి నగర్ బ్రాంచి, హైదరాబాద్.

డబ్బు కట్టిన వివరాలను ఇమెయిలు/ ఫోను/ ఉత్తరం ద్వారా కొత్తపల్లికి తెలియపరచగలరు.


ఇమెయిలు: team@kottapalli.in
ఫోను: 08559 240222.

కృతజ్ఞతలు:

పత్రికకోసం నిరంతరంగా పిల్లల రచనల్ని అందించి సహకరిస్తున్న ప్రకృతిబడి, టింబక్టు బడి, విజ్ఞం స్కూల్ యాజమాన్యాలకు కృతజ్ఞతలు. వెబ్ సైటుకు వెన్నుదన్నుగా నిల్చిన infogami యాజమాన్యానికి, దాన్ని సుసాధ్యం చేసిన python భాషకు, చక్కని ఆపరేటింగ్ సిస్టం linux ను అందించిన ubuntu వారికి, గొప్ప వ్యవస్థని పూర్తిగా ఉచితంగా అందిస్తున్న OpenOffice వారికి, తెలుగును రప్పిస్తున్న Unicode, Scim, Baraha లకు, చిత్రాలను సరిదిద్దే Software Gimp నిర్మాతలకు, శబ్దాలను చక్కబరచే Software Audacity నిర్మాతలకు కృతజ్ఞతలు.

మంచి పుస్తకం: 2

చెట్లు నాటిన మనిషి




పేజీలు:20, వెల: 5రు.

ఈ నేల నీదా? " అని అడిగాను.

' కాదు ' అతని సమాధానం.

' పోనీ, ఎవరిదో తెలుసా?'

' తెలియదు. '



పేజీలు:48, వెల: 20రు.

ఆ భూమి ఎవరిదో తెలుసుకోవాలన్న ఆసక్తి అతనికి లేదు. విత్తనాల్ని ఎంతో శ్రద్ధతో నాటుతున్నాడు. గత మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ప్రతిరోజూ అతను ఇదే పని చేస్తున్నాడు. ఇప్పటికి ఈ విధంగా ఒక లక్ష విత్తనాలను నాటాడు. లక్షలో ఇరవై వేల విత్తనాలు మొలకెత్తాయి. ఈ ఇరవై వేలలో ఎలుకలకూ, ప్రకృతి వైపరీత్యాలకూ పది వేల మొక్కలు పోయి ఉంటాయని అతని అంచనా. పూర్తిగా బీడు అయిన ఈ ఎడారి నేలలో పది వేల ఓక్ చెట్లు పెరుగుతున్నాయన్నమాట.

అప్పుడతని వయస్సు యాభై అయిదు.

32 సంవత్సరాల తర్వాత అక్కడి శిథిలాలు, ఎడారుల స్థానంలో వ్యవసాయ క్షేత్రాలు ఏర్పడినై. ఒకప్పుడు ఎండిపోయిన సెలయేళ్లు ఇప్పుడు మళ్ళీ పారుతున్నై. ప్రజలు వాటిని పంట కాలువలుగా మలుచుకున్నారు. అక్కడి అడవంతా దానంతట అదే తయారైందని అనుకుంటున్నారు వాళ్లు.

'చెట్లునాటిన మనిషి '(ఎల్జియార్డ్ బౌఫర్) నాటింది విత్తనాల్ని కాదు- మానవత్వపు శక్తిపై నమ్మకాన్ని. అతను పెంచింది చెట్లను కాదు- సంతోషపు వెలుగుల్ని. అలాంటి పాత్రను సృజించిన జీన్‌గైనో ధన్యుడు. అందరూ చదవాల్సిన చక్కని, చిన్నకథ, "చెట్లు నాటిన మనిషి".